

హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ : 18004251442

యాదాద్రి : 1800 425 7106

సూర్యాపేట : 1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 60

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.112	175	200
సూర్యాపేట	రూ.125	180	210
నల్లగొండ	రూ.125	195	210

ఉష్ణోగ్రత గరిష్ఠం 35.0 | కనిష్ఠం 20.0

వ్యవసాయ యాంత్రీకరణకు గ్రీన్‌సిగ్నల్



» మార్గదర్శకాలు విడుదల చేసిన ప్రభుత్వం

» తొలి విడతలో ఉమ్మడి జిల్లాలో 1,552మంది లబ్ధిదారులు

నల్లగొండ, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం వ్యవసాయ యాంత్రీకరణ పథకానికి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. గురువారం ప్రభుత్వం మార్గదర్శకాలను విడుదల చేసింది. ఈ నేపథ్యంలో ఉమ్మడి నల్లగొండ జిల్లాలో వ్యవసాయ శాఖ అధికారులు అందుకు అనుగుణంగా ప్రణాళికలను సిద్ధం చేస్తున్నారు. ఈ నెలాఖరుతో ఆర్థిక సంవత్సరం ముగుస్తుండటంతోపాటు బడ్జెట్‌ను ఈనెలలో ప్రవేశపెట్టడానికి ముందే లాంఛనంగా వ్యవసాయ యాంత్రీకరణ పథకాన్ని చేపడుతున్నారు. వచ్చే బడ్జెట్‌లో వ్యవసాయ యాంత్రీకరణ పథకానికి నిధులు కేటాయించే అవకాశాలు ఉన్నాయి.

ఉమ్మడి జిల్లాకు రూ.3,59,86,000

ఉమ్మడి జిల్లాలో మొదటి విడతగా 1552 మంది రైతులకు రూ.3,59,86,000ను కేటాయించింది. ఆధునిక వ్యవసాయాన్ని ప్రోత్సహించడం కోసం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌తోపాటు ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పడిన తర్వాత కొనసాగిన వ్యవసాయ యాంత్రీకరణ పథకం ఆరేళ్లగా నిలిచిపోవడంతో రైతులు ఆధునిక వ్యవసాయంపై దృష్టిసారించే అవకాశాలు లేకుండా పోయాయి. గత బీఆర్ఎస్ ప్రభుత్వం నాలుగేళ్ల పాటు వ్యవసాయ యాంత్రీకరణ పథకాన్ని నడిపించింది. అప్పట్లో ఉమ్మడి జిల్లాకు నాలుగేళ్లలో సుమారు రూ.50కోట్లను కేటాయించింది. అయితే యాంత్రీకరణ పథకంలో అత్యధికంగా ట్రాక్టర్లను మంజూరు చేశారు. ఈ ట్రాక్టర్లు అధికంగా బీఆర్ఎస్ కార్యకర్తలకే ఇచ్చారన్న ఆరోపణలు అప్పట్లో పెద్ద ఎత్తున వెల్లువెత్తడంతో పథకం అభాసుపాలైంది. ఇక కొన్ని పరికరాలను కూడా రాయితీపై ఇచ్చినప్పటికీ రైతులకు ఉపయోగం లేకుండా పోయింది. పథకం అమలు వివాదాస్పదం కావడంతో అప్పటి తెలంగాణ ప్రభుత్వం ఆ పథకాన్ని 2018లో అర్థంతరంగా నిలిపివేసింది. తరువాత రైతుల నుంచి, రైతు సంఘాల నుంచి పథకం అమలు కోసం డిమాండ్ వచ్చినా, గత ప్రభుత్వం అమలులోకి తేలేదు. దీంతో ఆరేళ్లగా వ్యవసాయ యాంత్రీకరణ పథకం ఊసే లేకుండా పోయింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఈ పథకాన్ని పునరుద్ధరించింది. తాజాగా మార్గదర్శకాలను కూడా విడుదల చేసింది.

నెలాఖరులోగా రాయితీపై యంత్రాలు

ఈ నెలాఖరున ఆర్థిక సంవత్సరం ముగిసేలోగా రైతుల నుంచి దరఖాస్తులు తీసుకొని వారికి రాయితీపై కేటాయించనున్నారు. జిల్లాల వారీగా రైతుల నుంచి ఉన్న డిమాండ్‌ను పరిగణనలోకి తీసుకోవడానికి నల్లగొండ, యాదాద్రి భువనగిరి, సూర్యాపేట జిల్లాల వ్యవసాయ అధికారుల నుంచి నివేదికలు సేకరించే పనిలో నిమగ్నమైంది. వ్యవసాయశాఖమంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు కొన్నిరోజులక్రితం వ్యవసాయ శాఖ కార్యదర్శితోపాటు డైరెక్టర్, ఇతర వ్యవసాయ అధికారులతో సమీక్ష కూడా నిర్వహించారు. పనిముట్లు, యంత్ర పరికరాల జాబితాను కూడా రూపొందించారు. వ్యవసాయ యాంత్రీకరణ పథకంలో భాగంగా రోటర్‌వేటర్‌లు, నాగళ్లు, కల్టివేటర్లు, స్ప్రేయర్లు..

మిగతా 7వ పేజీలో..

స్థానికంగానే ఉపాధి శిక్షణ



గ్రామీణ యువత స్వయం ఉపాధి శిక్షణకు సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తుంది. దీంతో చాలా మంది ఈ శిక్షణకు దూరమవుతున్నారు. అయితే జిల్లాలోని పేద తరగతి యువతకు శిక్షణను స్థానికంగానే ఇచ్చేందుకు జిల్లాకు ఆర్ఎస్ఈటీఐ(రూరల్ సెల్ఫ్ ఎంప్లాయిమెంట్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్) మంజూరు చేసింది. కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ నిర్వహించే ఈ శిక్షణను జిల్లా పరిధిలో డీఆర్డీవో, బ్యాంకు సహకారంతో నిర్వహిస్తున్నారు.

- (ఆంధ్రజ్యోతి-యాదాద్రి)

» జిల్లాకు ఆర్ఎస్ ఈటీఐ మంజూరు

» ఎకరం స్థలంలో రూ.2కోట్లతో కేంద్రం ఏర్పాటు

» స్థలం కేటాయింపుపై కలెక్టర్‌కు డీఆర్‌డీఏ విన్నపం

» గ్రామీణ ప్రాంతాల్లో నిరుద్యోగ సమస్యను తగ్గించడమే లక్ష్యం

గ్రామీణ ప్రాంతాల్లో నిరుద్యోగ సమస్యను తగ్గించేందుకు యువతకు అవసరమైన నైపుణ్య శిక్షణ ఇవ్వనున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో బ్యాంకులు అభ్యర్థులకు ఉచితంగా భోజనం, వసతి సౌకర్యం కల్పించి శిక్షణను ఇవ్వనున్నాయి. శిక్షణ పూర్తయిన తర్వాత యువతకు స్వయం ఉపాధి పొందే అవకాశాలు కూడా చూపించనున్నారు. జిల్లాలో కెనరా బ్యాంకు ఆధ్వర్యంలో ఈ శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తారు. సాధారణంగా కేంద్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రతీ జిల్లాలో ఒక ఆర్ఎస్ఈటీఐ ఉంటుంది. అయితే జిల్లాల పునర్విభజన అనంతరం కేంద్ర ప్రభుత్వం జిల్లాకు ప్రత్యేకంగా ఆర్ఎస్ఈటీఐను మంజూరు చేసింది. ఇప్పటివరకు ఉమ్మడి నల్లగొండ జిల్లా పరిధిలోని సంస్థలోనే యువత శిక్షణ పొందుతున్నారు. జిల్లాలో నూతనంగా ఆర్ఎస్ఈటీఐని ఏర్పాటుచేసేందుకు జిల్లాయంత్రాంగం సన్నాహాలు చేస్తోంది. జిల్లాలో మొత్తం 17 మండలాలు, ఆరు మునిసిపాలిటీలు 428 గ్రామపంచాయతీలున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం జిల్లాలో ఏప్రిల్ 2025 నుంచి వివిధ కోర్సుల్లో గ్రామీణ ప్రాంతాల్లోని యువతకు శిక్షణ ఇప్పించాలని ఆదేశాలు జారీచేసింది. ఈనేపథ్యంలో ప్రస్తుతం అద్దె భవనంలో కోర్సులు ప్రారంభించి, అనంతరం నూతనంగా భవనాన్ని నిర్మించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. స్థానిక యువత ఇక నుంచి పలు స్వయం ఉపాధి కోర్సుల్లో ఉచితంగా శిక్షణ పొందేందుకు స్థానికంగా కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నారు. దీంతో స్థానిక యువతకు ఎంతో ప్రయోజనం చేకూరనుంది.



వివిధ కోర్సుల్లో శిక్షణ

నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కల్పించేందుకు వివిధ కోర్సులను బ్యాంకు ద్వారా నిర్వహిస్తారు. ప్రతీ ఆర్ఎస్ఈటీఐ ఆర్థిక సంవత్సరంలో వివిధ కోర్సుల్లో 30నుంచి 40కోర్సుల్లో నైపుణ్య అభివృద్ధి కార్యక్రమాలు అందించాలి. ఈ కార్యక్రమాలు మూడు నుంచి ఆరు వారాల వ్యవధిలో ఉంటాయి. కేంద్ర ప్రభుత్వ సహకారంతో శిక్షణ పొందే అభ్యర్థుల్లో అర్హతలున్న ఎస్సీ, ఎస్టీలు, మైనార్టీలు, దివ్యాంగులు, మహిళలకు ఇస్తారు. ఒక్కో బ్యాచ్‌లో 25-30 మంది ఉంటారు. ఈ శిక్షణలో ప్రధానంగా వ్యవసాయ కార్యక్రమాలు, అనుబంధ కార్యకలాపాలైన పాడి పరిశ్రమ, కోళ్ల పెంపకం, తేనెటీగల పెంపకం, ఉద్యానవనం, పట్టు పురుగుల పెంపకం, పుట్టగొడుగుల పెంపకం తదితర కోర్సులు ఉంటాయి. అదేవిధం గా ఉత్పత్తి రంగంలో పురుషులు, మహిళలకు కుట్టు శిక్షణ, రెక్సిన్ వస్తువులు, ధూపం కడ్రల తయారీ, బ్యాగుల తయారీ, బేకరీ ఉత్పత్తులు, లీఫ్ కప్ తయారీ, రీసైకిల్ చేసిన కాగితం కప్పుల....

- మిగతా 8వ పేజీలో..

భవన నిర్మాణానికి ఎకరం స్థలం కోసం ప్రతిపాదన

ఆర్ఎస్ఈటీఐకోసం భవన నిర్మాణం, ఇతర మౌలిక సదుపాయాలు ఖర్చులను కేంద్ర ప్రభుత్వం భరిస్తుంది. భవన సముదాయాలు నిర్మించేందుకు ఎకరం స్థలం కావాలని డీఆర్డీఏ కలెక్టర్‌కు నివేదించింది. జిల్లాకేంద్రానికి సమీపంలో స్వయం ఉపాధి శిక్షణకు అనువైన స్థలాన్ని కేటాయించాలని రెవెన్యూ అధికారులకు లేఖ రాసింది. ఈ స్థలాన్ని కలెక్టర్‌తోపాటు రెవెన్యూ, డీఆర్డీఏ, బ్యాంకు అధికారులు పరిశీలించి, నూతన భవన నిర్మాణంపై నిర్ణయం తీసుకోనున్నారు. ఎకరం స్థలంలో భవన నిర్మాణ ఖర్చులు పూర్తిగా కేంద్ర ప్రభుత్వమే భరించనుంది. ఇందుకోసం రూ.2కోట్లు మంజూరుచేసింది. ఆర్ఎస్ఈటీఐ నిర్మాణంలో భాగంగా రెండు వర్క్‌షాపులు, అభ్యర్థుల కోసం స్నానపు గదులు, రెండు డార్మెటరీలు, శిక్షణ, పరిపాలన భవనాలు, అభ్యర్థు కోసం హాస్టల్, సిబ్బంది కోసం వసతిగృహాలు నిర్మించనున్నారు. మహిళలకోసం ప్రత్యేకంగా మూడు గదులు, దివ్యాంగులు శిక్షణ పొందేలా వారికి అనుకూలంగా గదులను నిర్మించనున్నారు.

రేపటి నుంచి ఒంటిపూట బడులు

» ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12.30వరకు » వచ్చే నెల 23 వరకు కొనసాగింపు



ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఈనెల 15వ తేదీ నుంచి ఒంటి పూట బడులు ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు గురువారం నాడు రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేట్ యాజమాన్యాల్లోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నతపాఠశాలలు ఈనెల 15నుంచి ఏప్రిల్ 23వ తేదీ వరకు ఉదయం 8గంటలనుంచి మధ్యాహ్నం 12.30గంటల వరకు పనిచేస్తాయి.

- (ఆంధ్రజ్యోతి-నల్లగొండ)

7

నేడు రంగుల మహో(లీ)త్సవం



హోలీ హోలీల రంగ హోలి చమ్మకేళిల హోలీ... వరుస లేని కాముడమ్మ హోలి చమ్మకేళిల హోలీ... వంటి పల్లె పాటలు, కోలాటాలు, చప్పట్లతో ఉత్సాహంగా వేడుకలు జరుపుకునేందుకు జిల్లా ప్రజలు సిద్ధమయ్యారు. కుల, మత, వర్గ బేధాలు వీడి, పేద, ధనిక, చిన్నా, పెద్ద అనే తారతమ్యాలను మరిచి అందరూ కలిసి ఆనందంగా జరుపుకునేది హోలీ పండుగ. హోలీ ఆడేటప్పుడు కలిగే ఆనందం మధుర జ్ఞాపకంగా ఉండాలంటే సహజ రంగులు చల్లుకోవాలని, రసాయన రంగులు చల్లుకుని ఆరోగ్యాన్ని, పర్యావరణాన్ని పాడు చేయవద్దని డాక్టర్లు, పర్యావరణ వేత్తలు చెబుతున్నారు.

- (ఆంధ్రజ్యోతి-మోత్కూరు, భువనగిరిటౌన్)

6

మొల్ల జీవితం స్ఫూర్తిదాయకం

మొల్లమాంబ జీవితం స్ఫూర్తిదాయకమని పలువురు వక్తలు కొనియాడారు. కవయిత్రి మొల్లమాంబ 584వ జయంతి సందర్భంగా జిల్లావ్యాప్తంగా ఆమె విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.



జిల్లాకేంద్రంలో నివాళి అర్పిస్తున్న నాయకులు

8

ఏటీసీ సెంటర్లతో నైపుణ్యం మెరుగు





ఏటీసీల ఏర్పాటుపై జిల్లా కలెక్టర్లతో సమీక్షిస్తున్న ఉపాధి కల్పన శిక్షణ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ సంజయ్‌కుమార్, పాల్గొన్న కలెక్టర్ హనుమంతరావు, అధికారులు

» అనువైన స్థలాలను ఎంపిక చేయాలి

» కలెక్టర్లకు సూచించిన ఉపాధి కల్పన శిక్షణ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ సంజయ్‌కుమార్

భువనగిరి (కలెక్టరేట్), మార్చి 13 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల యువతలో అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లతో (ఏటీసీ) వృత్తి నైపుణ్యాలు పెరుగుతాయని ఉపాధి కల్పన శిక్షణ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ సంజయ్‌కుమార్ అన్నారు. ఏటీసీల ఏర్పాటుపై ఆయన జిల్లా కలెక్టర్లతో గురువారం వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. ప్రభుత్వం గ్రామీణ నియోజకవర్గాల్లో అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లను ఏర్పాటు చేయనుందన్నారు. రాష్ట్రంలో ఇప్పటికే 70 ఏటీసీ కేంద్రాల నిర్మాణాలు జరుగుతూ వివిధ దశల్లో ఉన్నాయన్నారు. ఐటీఐ, ఏటీసీ సెంటర్లులేని గ్రామీణ ప్రాంత అసెంబ్లీ నియోజకవర్గకేంద్రంలో అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఏటీసీ సెంటర్ల నిర్మాణానికి అనువైన స్థలాలను గుర్తించి నివేదికలను త్వరగా పంపాలని కలెక్టర్లను ఆదేశించారు. రోడ్డు రవాణా వసతితోపాటు సమీపంలో పరిశ్రమలు ఉన్న స్థలాల ఎంపికకు ప్రాధాన్యమివ్వాలన్నారు. విద్యార్థుల ప్రవేశాలు, ఇన్‌స్ట్రక్టర్ల రాకపోకలు సులువుగా ఉంటాయన్నారు. స్థానికంగా పరిశ్రమలు ఉన్న ప్రాంతంలో ఏటీసీలు ఏర్పాటు చేస్తే పారిశ్రామిక అంశాల ట్రేడ్లతో యువతకు శిక్షణ అందించిన తర్వాత పరిశ్రమల్లో ఉపాధి అవకాశాలు పొందేలా ప్రణాళిక లు చేపట్టవచ్చన్నారు. అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకొని స్థలాలను ఎంపిక చేయాలన్నారు. కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ ఎం.హనుమంతరావు, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి టీ.నాగిరెడ్డి, ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ హరికృష్ణ, చీఫ్ ప్లానింగ్ అధికారి శామ్యూల్, జిల్లా ఉపాధి కల్పనాధికారి సాహితి పాల్గొన్నారు.

ధాన్యాన్ని పక్కదారి పట్టిస్తే చర్యలు

అదనపు కలెక్టర్(రెవెన్యూ) జీ.వీరారెడ్డి



మిల్లర్లతో సమీక్ష నిర్వహిస్తున్న అదనపు కలెక్టర్ వీరారెడ్డి

భువనగిరి (కలెక్టరేట్), మార్చి 13 (ఆంధ్రజ్యోతి): ధాన్యాన్ని పక్కదారి పట్టిస్తే కఠిన చర్యలు ఉంటాయని, యాసంగి సీజన్ 2023-24కు సంబంధించి సీఎంఆర్ బియ్యాన్ని మార్చి 17లోగా అందజేయాలని అదనపు కలెక్టర్(రెవెన్యూ) జీ.వీరారెడ్డి మిల్లర్లను ఆదేశించారు. సీఎంఆర్ డెలివరీని వేగవంతం చేయాలని సూచించారు. రైస్ మిల్లర్లు, అధికారులతో తన ఛాంబర్‌లో గురువారం సమావేశం ఏర్పాటు చేసి సీఎంఆర్ బియ్యం సేకరణపై మాట్లాడారు. జిల్లాలో 96 శాతం బియ్యం డెలివరీ పూర్తయిందని మిగిలిన నాలుగు శాతం బియ్యాన్ని గడువులోగా అందించి జిల్లాను ముందంజలో ఉంచాలన్నారు. అదేవిధంగా వానాకాలం ధాన్యం డెలివరీ చేయని మిల్లర్లు మొదలు పెట్టాలన్నారు. ప్రభుత్వ ధాన్యాన్ని దుర్వినియోగం చేస్తే క్రిమినల్ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లాలో తనిఖీ బృందాలు ఎప్పటికప్పుడు మిల్లులను తనిఖీచేసి నివేదికలు అందించాలన్నారు. మిల్లర్లు బియ్యం డెలివరీని వేగంగా చేస్తే యాసంగి సీజన్‌కు స్థలాభావం ఉండబోదన్నారు. మిల్లర్లు దించుకున్న ధాన్యానికి సరిపడా బ్యాంకు గ్యారెంటీని సమర్పించాలని, అంతేకాకుండా మిల్లర్లకు ఇప్పుడు కేటాయించిన సీఎంఆర్ లక్ష్యం పూర్తి చేయని వారికి ధాన్యం కేటాయింపులు చేయబోమని చెప్పారు. సమావేశంలో జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మార్త వెంకటేశం, పౌర సరఫరాలశాఖ జిల్లా మేనేజరు డీ.హరికృష్ణ, పౌర సరఫరాల అధికారి వనజాత అధికారులు, మిల్లర్లు పాల్గొన్నారు.

భువనగిరి రూరల్: తల్లిదండ్రులు, వృద్ధులపై గౌరవం పెరగాలని అదనపు కలెక్టర్ వీరారెడ్డి అన్నారు. ఖమ్మంకు చెందిన సేవా సంస్థ సమకూర్చిన రూ.2లక్షల విలువైన నిత్యావసర సరుకులు, ఫ్యాన్లు, కూలర్లు, దుప్పట్లను ఆయన రాయిగిరిలో అనాథ వృద్ధాశ్రమానికి అందజేసి మాట్లాడారు. కార్యక్రమంలో యాకుబీ చోటు, సామాజిక కార్యకర్తలు సుదర్శన్, సుదీర్, నజీర్, అఖిల్ పాల్గొన్నారు.

ఎండిన పంటకు ఎకరాకు రూ.40వేలు ఇవ్వాలి

● బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఊట్కూరి అశోక్‌గౌడ్



తుర్కపల్లి మండలంలో ఎండిన పంటను పరిశీలిస్తున్న బీజేపీ నేతలు

తుర్కపల్లి,మార్చి 13(ఆంధ్రజ్యోతి): వర్షాభావ పరిస్థితుల కారణంగా ఎండిన ప్రతీ ఎకరాకు రూ.40వేల నష్టపరిహారం ఇచ్చి రైతులను ఆదుకోవాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఊట్కూరి అశోక్ గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తుర్కపల్లి మండలం గంధమల్ల పంచాయతీ పరిధిలోని చెక్కలగూడెంలో గురువారం ఎండి వరిపంటను బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పడాల శ్రీనివాస్, కిసాన్ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జగన్‌మోహన్‌రెడ్డి, పార్టీ శ్రేణులతో కలిసి పరిశీలించి మాట్లాడారు.రైతులకు పరిహారం అందించకపోతే రైతులతో కలిసి ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య క్యాంపు కార్యాలయాన్ని ముట్టడిస్తామన్నారు. కార్యక్రమంలో కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు పకీర్ రాజేందర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు బానోతు చత్రునాయక్, నాయకులు అచ్చయ్య, రచ్చ శ్రీనివాస్, మేకల శ్రీనివాస్, కొక్కొండ లక్ష్మీనారాయణ, ఆకుల రమేశ్ పాల్గొన్నారు.

ఎండిన పంటలతో రైతుల అరిగోస

యాదగిరిగుట్ట రూరల్: ఆలేరు నియోజకవర్గంవ్యాప్తంగా పంటలు ఎండిపోయి రైతులు అరిగోస పడుతున్నారని బీజేపీ కిసాన్ మోర్చ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పడమటి జగన్మోహన్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఊట్కూరి అశోక్ గౌడ్, కిసాన్‌మోర్చ జిల్లా అధ్యక్షుడు పకీర్ రాజేందర్‌రెడ్డి అన్నారు. మండలంలోని సైదాపురం, మల్లాపురం గ్రామాల్లో కిసాన్ మోర్చ ఆధ్వర్యంలో పొలంబాట కార్యక్రమంలో భాగంగా ఎండిన వరిపంటను పరిశీలించి మాట్లాడారు. కార్యక్రమంలో గుంటిపల్లి మహేశ్వరిసత్యం, గుండ నర్సింహులు, రచ్చ శ్రీనివాస్, కాదూరి అచ్చయ్య, కర్రె ప్రవీణ్, చంద్రమోహన్ పాల్గొన్నారు.

అహంకార ధోరణికి నిదర్శనం

● గొంగిడి సునీత మహేందర్‌రెడ్డి

యాదాద్రి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డిని ఈ అసెంబ్లీ సమావేశాల నుంచి సస్పెండ్ చేయడం రాష్ట్ర ప్రభుత్వ అహంకార ధోరణికి నిదర్శనమని మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత మహేందర్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు ఓ ప్రకటన విడుదలచేస్తూ అసెంబ్లీ సమావేశాల్లో మాట్లాడుతున్నప్పుడు అధికార పార్టీ శాసనసభ్యులు అడ్డుకున్నారని, ప్రశ్నించే గొంతుకను నొక్కేసే ప్రయత్నం జరిగిందని ప్రజలు గ్రహించారన్నారు. జిల్లాకు సంబంధించిన సమస్యల్ని ప్రభుత్వం దృష్టికి తీసుకురావడానికి ఏకైక వ్యక్తిగా ప్రయత్నిస్తూ ఉంటే ఆ ఒక్క గొంతుకను కూడా నొక్కేస్తూ సస్పెండ్ చేయడం ఏమాత్రం కూడా సమర్థనీయం కాదన్నారు.

ప్రశ్నిస్తే సస్పెండ్ చేస్తారా? : భిక్షమయ్యగౌడ్

భువనగిరి (కలెక్టరేట్), మార్చి 13 (ఆంధ్రజ్యోతి): హామీలు నెరవేర్చాలని ప్రశ్నిస్తే మాజీ మంత్రి జగదీష్‌రెడ్డిని అసెంబ్లీ సమావేశాల నుంచి సస్పెండ్ చేయడం సిగ్గుచేటని బీఆర్ఎస్ రాష్ట్ర నేత బూడిద భిక్షమయ్య గౌడ్ విమర్శించారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రజా సమస్యలను గురించి అడిగితే సస్పెన్షన్ చేయడం ఏమిటని మండిపడ్డారు. తెలంగాణ ఉద్యమ సమయంలో కీలకపాత్ర పోషించి, మంత్రిగా పని చేసిన నాయకుడు శాసనసభలో ప్రజా సమస్యలపై నిలదీస్తే తట్టుకోలేక సస్పెండ్ చేశారని ఆరోపించారు. ప్రశ్నించే గొంతులను నొక్కాలని చూస్తే ఊరుకునేది లేదన్నారు. సస్పెన్షన్‌కు వ్యతిరేకంగా శుక్రవారం నిరసనలు తెలిపి ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేయాలన్నారు.

మెడికల్ కళాశాలపై స్పష్టత ఇవ్వాలి

సీపీఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు



సమావేశంలో మాట్లాడుతున్న గోద శ్రీరాములు

యాదగిరిగుట్ట రూరల్, మార్చి 13, (ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట మండలంలోని మల్లాపురం గ్రామంలో ఏర్పాటు చేస్తానన్న మెడికల్ కళాశాల నిర్మాణంపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు డిమాండ్‌చేశారు. గురువారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏఐవైఎఫ్ మండల మూడో మహాసభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం మల్లాపురం గ్రామంలో మెడికల్ కళాశాల నిర్మాణానికి శంకుస్థాపన చేసిందని, మూడేళ్లు గడిచినా అతీగతీ లేదన్నారు. యాదగిరిగుట్ట మున్సిపాలిటీలోని 12వార్డుల అభివృద్ధికి రూ.50కోట్లు కేటాయించాలన్నారు. అనంతరం ఏఐవైఎఫ్ మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడు ఎర్ర అశోక్, ప్రధాన కార్యదర్శి కంబాల వెంకటేష్ మరో ఏడుగురు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి పేరబోయిన మహేందర్, సీపీఐ జిల్లా సమితి సభ్యుడు బబ్బూరి శ్రీధర్, నాయకులు అనంతుల నర్సింహ, శేఖర్ పాల్గొన్నారు.

పెరటి కోళ్ల పెంపకంతో రైతులు ఆర్థికంగా ఎదగాలి

హైదరాబాద్ జాతీయ మాంస పరిశోధన సంస్థ డైరెక్టర్ డాక్టర్ బర్కుడే

తుర్కపల్లి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): పెరటి కోళ్ల పెంపకంతో గిరిజన రైతులు ఆర్థికంగా ఎదగాలని హైదరాబాద్ జాతీయ మాంస పరిశోదన సంస్థ డైరక్టర్ డాక్టర్ బర్కుడే అన్నారు. మండలంలోని కర్షలగడ్డతండా, ధర్మారం, పర్రెబావి తండా, సంగ్యాతండాల్లో గురువారం హైదరాబాద్ జాతీయ మాంస పరిశోధన సంస్థ ద్వారా గురువారం గిరిజన రైతులకు ఉచితంగా పెరటికోళ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో పేద ప్రజలకు సరైన పోషకాహారం దొరకక ఇబ్బందులు పడుతున్నారనే ఉద్దేశంతోనే ఈ ప్రాంతంలోని గిరిజనులకు ఉచితంగా పెరటి కోళ్లను పంపిణీ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో భువనగిరి ఏడీ శ్రీనివాస్, శాస్త్రవేత్త బసవ రెడ్డి, వెటర్నరీ డాక్టర్ రామచంద్రారెడ్డి, చంద్రారెడ్డి, సునీత, పశు వైద్య సిబ్బంది శంశోద్దీన్, రాఘవేందర్, ప్రవీణ్ పాల్గొన్నారు.

మహిళా ఆరోగ్య సిబ్బంది సేవలు విస్తరించాలి

డీఎంహెచ్‌వో



భూదాన్‌పోచంపల్లి పీహెచ్‌సీలో మహిళా ఆరోగ్య సిబ్బందిని సన్మానిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ మనోహర్

భూదాన్ పోచంపల్లి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): మహిళా ఆరోగ్య సిబ్బంది సేవలను విస్తరించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ మనోహర్ అన్నారు. గురువారం పట్టణంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు సరైన వైద్య సాయం అందించడంలో మహిళా సిబ్బంది కీలక పాత్ర పోషించాలన్నారు. ఆరోగ్య సూచనలు, పోషకాహారం తీసుకోవడంవల్ల కలిగే ఉపయోగాలను వివరించాలన్నారు. ప్రభుత్వ ఆస్పత్రిలోనే ప్రసవాలు జరిగేలా, ఆ దిశగా ఆరోగ్య సిబ్బంది పనిచేయాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ యశోద, మండల వైద్యాధికారి శ్రీవాణి, సీహెచ్‌వో పోతారెడ్డి, హెల్త్ ఎడ్యుకేటర్ వసంత, ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాల వైద్యులు, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

శ్రీరామలింగేశ్వర స్వామి కల్యాణం నేడు



(ఆంధ్రజ్యోతి-మోత్కూరు): హోలీ పండుగ రోజు నుంచి యాదాద్రిభువనగిరి జిల్లా మోత్కూరు పట్టణంలోని శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు నిర్వహించడం ఇక్కడి ప్రత్యేకత. ప్రతి ఏటా కాముని దహనం జరిగిన తెల్లవారి శ్రీ రామలింగేశ్వరస్వామి కల్యాణం నిర్వహిస్తారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా కల్యాణం జరిగిన ఐదు రోజులకు 'అగ్ని గుండాలు' జరుగుతాయి. శ్రీ రామచంద్రుడు ఇక్కడి ఆలయంలోని శివలింగానికి పూజ చేసి వెళ్లాడని అందుకే ఈ ఆలయానికి పేరొచ్చిందని చెబుతారు.

ఆలయం ముస్తాబు...

స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయానికి రంగులు వేయించి, విద్యుద్దీపాలతో ఆలయాన్ని ముస్తాబు చేశారు. లౌడ్‌స్పీకర్లు అమర్చి వేడుకలకు సిద్ధం చేశారు. శుక్రవారం(ఈ నెల 14న) ఉదయం 5గంటలకు స్వామివారి కల్యాణం నిర్వహించేందుకు అన్నిఏర్పాట్లు చేశారు. ఈ నెల 15న రాత్రి గరుడ సేవ, 17న రాత్రి రథోత్సవం, 19న రాత్రి స్వామివారిని పట్టణంలో ఊరేగింపు, 20న సూర్యుడు ఉదయిస్తున్న సమయాన 'అగ్నిగుండాలు' నిర్వహిస్తారు. 21న రాత్రి జరిగే దోపోత్సవంతో స్వామివారి కల్యాణోత్సవాలు ముగుస్తాయి. కల్యాణోత్సవం, అగ్నిగుండాలను తిలకించడానికి చుట్టుపక్కల మండలాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలివస్తారు.

నేడు రంగుల మహో(లీ)త్సవం



ఉత్సాహంగా పిల్లలు, పెద్దలు అందరూ కలిసి నేడు ఆనందంగా జరుపుకునే పండుగ హోలీ. ప్రాచీనమైన పండుగల్లో ఇది ఒకటి. గ్రీష్మరుతువు ఆరంభంలో, వసంత రుతువు చివర్లో పాల్గుణ మాసం పౌర్ణమి రోజు కాముడిని దహనం చేసి మరుసటి రోజున రంగులు చల్లుకుంటూ హోలీని జరుపుకుంటారు. ఈ నెల 13వ తేదీ రాత్రి కాముడి దహనం నుంచే ఆటపాటలతో వేడుకలు ఘనం గా మొదలయ్యాయి. శివపార్వతుల ప్రేమకు కామంతో అడ్డంకి గా మారిన కామ దేవుడికి బుద్ధి చెప్పేలా ప్రారంభమైన కామ దహనాన్ని గురువారం రాత్రి ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని అన్ని పట్టణాలు, గ్రామాల్లో ఉత్సాహంగా నిర్వహించారు. యువకులు జట్లుగా ఇంటింటికి వెళ్లి పాత వస్తువులను సేకరించి కూడళ్లలో పేర్చి దహనం చేశారు.

- (ఆంధ్రజ్యోతి-నల్లగొండ కల్చరల్/మోత్కూరు(భువనగిరి టౌన్)



సహజ రంగులతో హోలీ ఆడితే ప్రమాదం ఉండదు. రసాయనిక రంగులతో అనర్థాలు ఏర్పడతాయి. ప్రకృతిలో లభించే ఆకులు, పూలరెక్కలతో తయారుచేసిన రంగులతో హోలీ ఆడితే చర్మం దెబ్బతినదు. రుతువులు మారిన కారణంగా బ్యాక్టీరియా, వైరస్, విషజ్వరాలను అదుపులో పెట్టుకోవటానికి పసుపు నీటిని పూర్వం చల్లుకునేవారు. ఎలాంటి ప్రభావం చూపని పువ్వుల సువాసనను, కూరగాయల తియ్యదనాన్ని ఆస్వాదిస్తూ హోలీని ఆడుకోవచ్చు. హోలీని హెర్బల్ రంగులతో ఆడి ఆనందంగా జరుపుకుని పర్యావరణాన్ని కాపాడాలని కొందరు పర్యావరణవేత్తలు పేర్కొంటున్నారు.

కృత్రిమంతో వ్యాధులే..

కృత్రిమ రంగుల్లోని లెడ్, అల్యూమినియం, బ్రోమైట్, మెర్క్యూరిక్‌సల్ఫేట్ క్యాన్సర్ వ్యాధులను సంక్రమింపజేసే ప్రమాదముంది. గులాబీ రంగులోని రొడమిన్‌బీ చర్మ వ్యాధులను, పర్పుల్ రంగులోని క్రోమియం అయోడైడ్ ఊపిరితిత్తుల సంబంధ వ్యాధులకు, ఆస్తమా రోగాలకు దారితీస్తుందంటున్నారు. ఇతర రసాయనాలతో జుట్టు ఊడటం, చర్మ వ్యాధులు రావడం జరుగుతుందంటున్నారు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు...

రంగులు చల్లుకునేటప్పుడు నోట్లో, కళ్లలో పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. నెత్తిపైన కోడిగుడ్లు కొట్టడం వంటి చర్యలతో మెదడు అదరడం, పెంకులు గుచ్చుకోవడం జరగవచ్చు. రంగులు చల్లుకునేటప్పుడు శరీరమంతా కప్పి ఉండేలా కాటన్ దుస్తులు వేసుకోవాలి. రంగులు చల్లుకోవడానికి వెళ్లే ముందు శరీరానికి కొబ్బరినూనె, ఆలివ్‌ఆయిల్ గాని రాసుకుంటే రంగులు శరీరానికి అంటకుండా ఉంటాయి. రంగులు చల్లుకోవడం పూర్తయ్యాక వేడి నీటితో తల స్నానం చేయాలి.



మోదుగ పూల సౌందర్యం...

హోలీ పండుగ అంటేనే గుర్తొచ్చేది మోదుగ వృక్షం. ఒకప్పుడు ఈ పూలతోనే ఎక్కువగా రంగులు తయారు చేసుకుని వేడుకల్లో చల్లుకునేవారు. వేసవికి ముందు రహదారుల వెంట పంట క్షేత్రాల్లో మోదుగు చెట్లు పూలతో ఆకట్టుకుంటున్నాయి. కేతేపల్లి, శాలిగౌరం మండలాల్లో రహదారుల వెంట మోదుల పూలతో చెట్లు.



హోలీ వేడుకలకు 'ముప్వారం' దూరం



శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయం.(ఫైల్)

(ఆంధ్రజ్యోతి-నిడమనూరు): దేశమంతా హోలీ సంబరాల్లో ఉండే ఆ ఆనందాలు, సరదాలకు నల్లగొండ జిల్లా నిడమనూరు మండలంలోని ముప్వారం గ్రామం దూరంగా ఉంటుంది. ఇది ఏళ్ల తరబడిగా ఆనవాయితీగా వస్తోంది. రోజంతా శాలివాహనుల కాలంలో నిర్మించిన 903 ఏళ్ల చరిత్ర కలిగి ఉన్న గ్రామంలోని పురాతన అలివేలుమంగ సమేత శ్రీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో మునిగిపోతారు. ఆలయంలో ప్రత్యేక పూజలతో పాటు స్వామి వారి కల్యాణాన్ని నిర్వహిస్తారు. వారం పాటు నిర్వహించే బ్రహ్మోత్సవాల్లో తిరుకల్యాణం ప్రతి ఏటా హోలీ పండుగ రోజునే చేయడం ఆనవాయితీగా వస్తోంది. అయితే ఈ ఉత్సవాల్లో ఉండే ప్రజలు హోలీ వేడుకలకు దూరంగా ఉంటారు. దీనికితోడు ఈ ఏడాది గ్రామంలో కనకదుర్గ, ముత్యాలమ్మ ఆలయాల్లో విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాలు నేటి నుంచి జరుగుతున్నాయి. దీంతో గ్రామంలో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది.

సల్కునూరులోనూ..

నల్లగొండ జిల్లా వేములపల్లి మండలం సల్కునూరు గ్రామస్థులు హోలీ రోజు వేడుకలకు దూరంగా ఉంటారు. గ్రామంలోని శ్రీస్వయంభూ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలను ప్రతి ఏడాది 10రోజులపాటు నిర్వహిస్తారు. ఉత్సవాల్లో భాగంగా చివరిరోజున నిర్వహించే గ్రామోత్సవం(డేగాట)లో గ్రామస్థులు ఉత్సవమూర్తులతో ఊరేగింపుగా కూడలికి చేరుకుంటారు. అక్కడ స్వామివారు, అమ్మవారు వైపు రెండు గ్రూపులుగా విడిపోయి వసంతోత్సవాన్ని ఆడుతారు. అనంతరం గ్రామస్థులు హోలీ వేడుకలను నిర్వహిస్తారు. ఈ నెల 19న గ్రామోత్సవంతో పాటు హోలీ వేడుకలను ఘనంగా నిర్వహించుకుంటామని గ్రామస్థుడు తమ్మడబోయిన రమేష్ తెలిపారు.



గత ఏడాది డేగాట(వసంతోత్సవం) ఆడుతున్న గ్రామస్థులు (ఫైల్)

- (ఆంధ్రజ్యోతి-వేములపల్లి)

నకిరేకల్ పోలీసుల అదుపులో సైబర్ నేరగాడు

నకిరేకల్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశంకు న్యూడ్ వీడియోకాల్ చేసిన సైబర్ నేరగాళ్లను నకిరేకల్ పోలీసులు పట్టుకున్నారు. ఈ నెల 4వ తేదీ రాత్రి మధ్యప్రదేశ్ రాష్ట్రం నుంచి సైబర్ నేరగాళ్లు ఫోన్ చేసి మహిళా నగ్న వీడియోను పోస్టు చేశారు. ఈ ఉదంతంపై ఎమ్మెల్యే పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో నకిరేకల్ సీఐ రాజశేఖర్‌తో పాటు పోలీసుల బృందం ఈ నెల 6వ తేదీన మధ్యప్రదేశ్‌కు వెళ్లి సైబర్ నేరగాన్ని ఒకరిని అదుపులోకి తీసుకుని నకిరేకల్ పోలీస్‌స్టేషన్‌కు ఈ నెల 10వ తేదీన తీసుకువచ్చింది. ఎస్పీ శరత్‌చంద్ర పవార్ ఆదేశాలతో విచారణ వేగవంతం చేస్తున్నారు. సైబర్ నేరగాన్ని జిల్లా సైబర్ క్రైం సిబ్బందికి నకిరేకల్ పోలీసులు అప్పగించారు. మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని ధార్ జిల్లాలో సైబర్ నేరగాన్ని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. ఈ కేసులో భాగస్వాములైన మిగతా వారిని పట్టుకునేందుకు నకిరేకల్ పోలీసులు ప్రయత్నిస్తున్నట్లు తెలిసింది.

రూ.20 లక్షల గంజాయి స్వాధీనం

చౌటుప్పల్ రూరల్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ పట్టణకేంద్రంలో 46 కిలోల గంజాయిని పట్టుకున్నట్లు సీఐ మన్మథకుమార్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని విశాఖ ఏజెన్సీ నుంచి బెంగుళూరుకు కారులో గంజాయి రవాణా జరుగుతున్నట్లు సమాచారం అందడంతో భువనగిరి ఎస్‌వోటీ పోలీసులు గురువారం రాత్రి మాటువేశారు. పట్టణ కేంద్రంలోని గణేశ్‌నగర్ సర్వీస్ రోడ్డులో కారులో వెళ్తుండగా వెంబడించి పట్టుకున్నారు. గంజాయి స్మగ్లర్ పోలీసుల కళ్లు కప్పి కారును వదిలేసి పరారయ్యాడు. 46 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. పట్టుబడిన గంజాయి విలువ రూ.20లక్షలు ఉంటుందని సీఐ తెలిపారు. నిందితుడి కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు వివరించారు.

వ్యక్తి అదృశ్యం



వినయ్

మిర్యాలగూడ అర్బన్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లా మిర్యాలగూడ మండలంలోని కిష్టాపురం గ్రామానికి చెందిన వ్యక్తి బుర్రి వినయ్ అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్ఐ లక్ష్మయ్య తెలిపారు. ఈ నెల 9వ తేదీన ఇంటినుంచి బయటకు వెళ్లిన వినయ్ తిరిగి రాలేదు. యువకుడి సెల్‌ఫోన్ స్విచ్ఛాఫ్ కావడంతో ఆందోళన చెందిన కుటుంబసభ్యులు ఆచూకీ తెలుసుకునేందుకు బంధువుల ఊళ్లలో ఆరా తీశారని, ఆచూకీ లభ్యం కావడంతో గురువారం ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. అదృశ్యమైన యువకుడు వినయ్ సుమారు 5.4 అంగుళాల ఎత్తు, ఛామనఛాయరంగు ఉంటాడని భార్య శీనారాణి ఫిర్యాదులో పేర్కొన్నట్లు ఎస్ఐ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని యువకుడి ఆనవాళ్లు తెలిసిన వారు 8712670189, 87126715151 నెంబర్లకు సమాచారమివ్వాలని ఎస్ఐ కోరారు.

స్వాతంత్ర్య సమరయోధుడు మృతి



ముత్యాలబాబు(ఫైల్)

అర్వపల్లి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట జిల్లా అర్వపల్లి మండలకేంద్రానికి చెందిన స్వాతంత్ర్య సమరయోధుడు ముత్యాల బాబు(93) అనారోగ్యంతో గురువారం మృతి చెందారు. ఆయనకు భార్య, ముగ్గురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ముత్యాలబాబు తెలంగాణ సాయుధపోరాటంలో బీంరెడ్డి నర్సింహారెడ్డి, మల్లు స్వరాజ్యంలకు కుడిభుజంగా ఉండి ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నారు. ఎర్రజెండా బాటలో ఉద్యమాలు చేశారు. ముత్యాలబాబు మృతదేహంపై మాజీ జడ్పీటీసీ దావుల వీరప్రసాద్‌యాదవ్, మాజీ ఎంపీపీ తాటికొండ సీతయ్య, వజ్జె శ్రీను, పులుసు సత్యం, చెరుకు యాకలక్ష్మి, యాదగిరి, కనుకు శ్రీనివాస్, బైరబోయిన మహారాజు, రామలింగయ్య, ముత్యాల బాలరాజు, బాలకృష్ణ పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కారులో నుంచి రూ. 2.5లక్షల నగదు చోరీ

నేరేడుచర్ల, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల పట్టణంలోని కారులో ఉంచిన రూ.2.5 లక్షల నగదు చోరీకి గురైంది. బాధితుడు గంగోత్రి ఆసుపత్రి మేనేజింగ్ డైరక్టర్ కనకపూడి మహేష్ తెలిపిన ప్రకారం ఉదయం 8.50 గంటలకు ఖమ్మంలోని ఓ బ్యాంకులో నగదు వేసేందుకు కారులో రూ.3లక్షల నగదు బ్యాగులో పెట్టి అందులో ఉంచారు. పని ఉండడంతో కారును రోడ్డుపైనే నిలిపి ఆసుపత్రికి వెళ్లి ఐదు నిముషాల వ్యవధిలో తిరిగి కారు వద్దకు చేరుకున్నట్లు తెలిపారు. కారులో ఉంచిన నగదును చూసుకోకుండా ఖమ్మం వెళ్లి బ్యాంకు వద్ద చూసుకోగా అందులో రూ.2.5 లక్షల నగదు పోయినట్లు గుర్తించాడు. కేవలం రూ.50వేలు మాత్రమే బ్యాగులో ఉండడంతో ఎవరో దొంగిలించి ఉంటారని గుర్తించినట్లు తెలిపారు. నగదు పోయిన ఘటనపై నేరేడుచర్ల పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

ఐదుగురు జూదరుల అరెస్టు

అనంతగిరి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : పేకాటఆడుతున్న ఐదుగురు వ్యక్తులను అరెస్టు చేసి వారి నుంచి నగదును స్వాధీనం చేసుకున్నట్లు సూర్యాపేట జిల్లా అనంతగిరి ఎస్ఐ నవీన్‌కుమార్ తెలిపారు. ఖానాపురం గ్రామశివారులో పేకాట ఆడుతున్నారనే సమాచారంతో వెళ్లగా పేకాడుతున్న గ్రామానికి చెందిన ఐదుగురు పట్టుకొని వారి వద్ద నుంచి రూ.1430 నగదు, రెండు బైక్‌లు, నాలుగు సెల్‌ఫోన్లను స్వాధీనపర్చుకుని వారిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ట్యాంకర్ ఢీకొని ఎనిమిది గొర్రెలు మృతి

పాలకవీడు, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా పాలకవీడు మండల కేంద్రంలో గొర్రెల మందపైకి గురువారం అతివేగంగా వచ్చిన ట్యాంకర్ ఢీకొనడంతో ఎనిమిది గొర్రెలు మృతి చెందినట్లు ఎస్ఐ లక్ష్మీనర్సయ్య తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని నాగిరెడ్డిగూడెం గ్రామానికి చెందిన మల్గిరెడ్డి అంజిరెడ్డి కొంతకాలంగా గొర్రెలు మేపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. గురువారం గొర్రెలను మేపడానికి రహదారి మీదుగా వెళ్తుండగా నేరేడుచర్ల నుంచి జాన్‌పహాడ్ వెళ్తున్న ట్యాంకర్ వెనుక నుంచి గొర్రెల మందపైకి దూసుకువెళ్లింది. ఈ ప్రమాదంలో ఎనిమిది గొర్రెలు మృత్యువాత పడగా 3 గొర్రెలకు తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటనలో రూ.లక్ష నష్టం వాటిల్లిందని యజమాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

అక్రమంగా బ్లాస్టింగ్‌కు పాల్పడ్డ వ్యక్తి అరెస్ట్

యాదగిరిగుట్ట రూరల్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : అనుమతులు లేకుండా అక్రమంగా బ్లాస్టింగ్‌కు పాల్పడుతున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు యాదాద్రిభువనగిరి జిల్లా యాదగిరిగుట్ట సీఐ రమేష్ తెలిపారు. పట్టణంలోని లోటస్ టెంపుల్ సమీపంలో హైదరాబాద్‌కు చెందిన విజయ్ ఎలాంటి అనుమతులు లేకుండా జిలెటిన్ స్టిక్స్‌తో బ్లాస్టింగ్‌లకు పాల్పడ్డాడు. దీంతో వ్యక్తిని అరెస్టు చేసి 350 జిలెటిన్‌స్టిక్స్ స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఆయన వివరించారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరి మృతి



సైదులు మృతదేహం

మిర్యాలగూడ అర్బన్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు మృతి చెందాడు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా మిర్యాలగూడ మండలం శ్రీనివాసనగర్‌లో గురువారం జరిగింది. రూరల్ ఎస్ఐ లక్ష్మయ్య తెలిపిన వివరాల ప్రకారం నేరేడుచర్ల మండలం బక్కయ్యగూడెం గ్రామానికి చెందిన మారేపల్లి సైదులు(60) శ్రీనివాసనగర్ సమీపంలోని కేఎస్‌పీ ఫంక్షన్ హాల్‌లో బంధువుల వివాహానికి హాజరయ్యాడు. అనంతరం మిర్యాలగూడకు వెళ్లేందుకు కోదాడ- జడ్చర్ల జాతీయ రహదారిని దాటుతుండగా, అదే సమయంలో తుంగపాడు నుంచి మిర్యాలగూడకు వెళ్తున్న టీఎస్05 ఈవై0765 నెంబరుగల బైక్ ఢీకొట్టింది. దీంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. గాయపడ్డ సైదులును అంబులెన్స్‌లో మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించగా, పరిస్థితి విషమించడంతో నల్లగొండజిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందినట్లు ఎస్ఐ తెలిపారు. సైదులు కుమార్తె నాగమణి ఫిర్యాదుమేరకు బైక్ యజమాని ప్రసాద్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అచ్చయ్య తెలిపారు.

తల్లి చికిత్స కోసం వెళ్లి...

మునుగోడు, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లా మునుగోడు శివారులో బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రగాయాలపాలైన వివాహిత చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది. ఎస్ఐ ఇరుగు రవి తెలిపిన వివరాల ప్రకారం మునుగోడు మండలంలోని కచలాపురం గ్రామానికి చెందిన జంగా సుజాత(42) అనారోగ్యానికి గురైన మండలంలోని చీకటిమామిడి గ్రామానికి చెందిన తల్లి తోటకూరి యాదమ్మకు వైద్యం చేయించేందుకు వెళ్లింది. అనంతరం మునుగోడు నుంచి మట్టిపల్లి నితిన్ బైక్‌పై తిరిగి వస్తుంది. స్థానికంగా ఉన్న ఓ పత్తి మిల్లు సమీపంలో గేదె అడ్డురావటంతో ప్రమాదం జరిగింది. బైక్‌పై వెనుక కూరున్న తల్లీకుమార్తెలకు గాయాలయ్యాయి. కుమార్తె సుజాతకు తలకు బలమైన గాయమై కావడంతో స్థానికులు, బంధువుల సాయంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు. అక్కడ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ మేరకు సుజాత భర్త వెంకన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

గంటసేపు క్యాబిన్‌లో విలవిల



క్యాబిన్‌ను తొలగిస్తున్న క్రేన్, చికిత్స పొందుతున్న డ్రైవర్ వర్మ

హుజూర్‌నగర్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : లారీని వెనక నుంచి టిప్పర్ ఢీకొట్టిన ఘటనలో టిప్పర్ డ్రైవర్ క్యాబిన్‌లో చిక్కుకుని విలవిల్లాడాడు. గంటసేపు ఆయన రోదనలు అందరినీ కదిలించాయి. కాగా డ్రైవర్ ప్రాణాపాయం నుంచి బయటపడ్డాడు. ఈ ఘటన సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ పట్టణంలో గురువారం తెల్లవారుజామున జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం చిలుకూరు మండలం కొండాపురం శివారులోని గుట్ట నుంచి అక్రమంగా మట్టిని తరలిస్తున్న టిప్పర్ హుజూర్‌నగర్‌లోని హరికృష్ణ ఆసుపత్రి సెంటర్‌లో ముందుగా వెళుతున్న లారీని వెనుక నుంచి ఢీకొట్టింది. దీంతో టిప్పర్ డ్రైవర్ కొండా వర్మ తీవ్రంగా గాయపడి క్యాబిన్‌లో చిక్కుకుపోయాడు. కాపాడాలని రోదిస్తూ కేకలు వేశాడు. గమనించిన స్థానికులు అందుబాటులో ఉన్న క్రేన్ సహాయంతో డ్రైవర్‌ను క్యాబిన్ నుంచి బయటకుతీశారు. ఇందుకోసం సుమారు గంటపాటు శ్రమించారు. తీవ్రంగా గాయపడిన అతడిని స్థానిక ఏరియా ఆసుపత్రికి, అక్కడి నుంచి ఖమ్మం ఆసుపత్రికి తరలించారు. కాగా సంఘటనకు సంబంధించి ఎలాంటి కేసు నమోదు కాలేదని ఎస్ఐ ముత్తయ్య తెలిపారు.

దేవాలయ భూముల్లో చెట్లు నరికేస్తే చర్యలు



చెట్లు నరికివేసిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న మల్లారెడ్డి

చిట్యాల రూరల్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా చిట్యాల మండలం గుండ్రాంపల్లి శివారులోని శ్రీరామలింగేశ్వరస్వామి దేవాలయానికి సంబంధించిన భూముల్లో చెట్ల నరికివేతపై కేసు నమోదు చేసినట్లు అటవీ శాఖ అధికారి మల్లారెడ్డి తెలిపారు. అఖిలపక్ష నాయకులు బుస్సు నర్సింహ, కోయగూర నర్సింహ, బొడిగె లక్ష్మయ్య, చెరుకుపల్లి సాయిలు, బత్తుల నర్సింహ, పెద్దగోని అంజన్‌కుమార్ ఫిర్యాదు మేరకు గురువారం బీట్ అధికారి మామిడి నర్సింహులుతో కలిసి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. దేవాలయం గుట్ట వెనుకభాగంలో ఎలాంటి అనుమతులు తీసుకోకుండా ఏళ్ళుగా ఉన్న చెట్లను నరికివేసినట్లు గుర్తించినట్లు మల్లారెడ్డి తెలిపారు. చెట్లను నరికివేసిన గుండ్రాంపల్లికి చెందిన అచ్చిన అంజయ్యపై కేసునమోదు చేసినట్లుగా తెలిపారు. దేవాదాయ శాఖలోనైనా, అటవీ భూముల్లోనైనా ఎలాంటి అనుమతుల్లేకుండా చెట్లను నరకకూడదన్నారు. అది నేరమని, ఎవరైనా అనుమతుల్లేకుండా ఇష్టారాజ్యంగా చెట్లను నరికితే ఫిర్యాదు చేయాలన్నారు. ఇదిలా ఉండగా దేవాలయానికి సంబంధించి భూమిలో చెట్లను ఆలయ కమిటీ చైర్మన్ సూచన మేరకే నరికేయాలని సూచించారని పలువురు గ్రామస్థులు ఆరోపించారు. ఈ విషయంపై ఆలయ కమిటీ చైర్మన్ బండ లింగస్వామిని సంప్రదించగా చెట్ల నరికివేతపై తమకు ఎలాంటి సంబంధంలేదని, చెట్ల నరికివేతపై తహసీల్దార్‌కు, అటవీశాఖ అధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

జాతీయస్థాయి క్విజ్ పోటీల్లో పేట విద్యార్థుల ప్రతిభ

● రాష్ట్ర స్థాయిలో విజేతలుగా...

జాతీయ స్థాయిలో నాలుగో స్థానం

● తేజ విద్యార్థుల ఘనత



తేజ పాఠశాల విద్యార్థులు హృతిక్, నవీన్

కోదాడ రూరల్, మార్చి 13(ఆంధ్రజ్యోతి):సూర్యాపేట జిల్లా కోదాడ మండల పరిధిలోని కొమరబండ తేజ విద్యాలయ విద్యార్థులు జాతీయ స్థాయి క్విజ్ పోటీల్లో ప్రతిభ చూపారు. కేంద్ర క్రీడల మంత్రిత్వ శాఖ, భారతీయ క్రీడా ప్రాధికార సంస్థ సంయుక్తంగా ఆన్‌లైన్‌లో నిర్వహించిన జాతీయస్థాయి ఫిట్ ఇండియా ఫైనల్ పోటీల్లో దేశవ్యాప్తంగా రాష్ట్రస్థాయిలో విజేతలైన 32జట్లు ఈ పాల్గొన్నాయి. తమ పాఠశాలకు చెందిన 10వ తరగతి విద్యార్థులు పల్లా హృతిక్, కొండ్రు నవీన్‌కుమార్ తెలంగాణ రాష్ట్రస్థాయి విజేతలుగా నిలిచి, జాతీయస్థాయిలో 4వ స్థానంలో నిలిచారని పాఠశాల ప్రిన్సిపాల్ ఉస్తెల రమాదేవి తెలిపారు. విద్యార్థులు రూ.5 లక్షల నగదు బహుమతులు అందుకోనున్నట్లు ఆమె తెలిపారు.

వడదెబ్బతో ఉపాధిహామీ కూలీ మృతి



నర్సమ్మ

రాజాపేట, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): యాదాద్రిభువనగిరి జిల్లా రాజాపేట మండలం సింగారం గ్రామంలో ఉపాధి హామీ కూలీ వడదెబ్బతో మృతిచెందింది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. సింగారం గ్రామానికి చెందిన బొల్లారం నర్సమ్మ (55) గురువారం ఉదయం ఉపాధి హామీ పనులకు వెళ్లింది. మధ్యాహ్నం ఇంటికి వచ్చి అస్వస్థతకు గురవటంతో కుటుంబసభ్యులు ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందింది. ఆమెకు ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు.

నీరాకేఫ్ అప్పగింత నిర్ణయం సముచితం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కల్లుగీత కార్మిక సంఘం అధ్యక్ష, కార్యదర్శులు వెంకన్న, సీతారాములు

నల్లగొండరూరల్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): పర్యాటక శాఖ పరిధిలోని నీరాకేఫ్‌లను కల్లు గీత ఆర్థిక సహకార సంస్థకు బదిలీ చేయాలన్న ప్రభుత్వ నిర్ణయం సముచితమని కల్లుగీత కార్మిక సంఘం నల్లగొండ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గొండ వెంకన్న, చొగోని సీతరాములు స్వాగతించి, హర్షం వ్యక్తం చేశారు. నల్లగొండ జిల్లా కేంద్రంలోని స్థానిక తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం కార్యాలయంలో గురువారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. నెక్లెస్ రోడ్డులోని నీరాకేఫ్ టూరిజం శాఖ భవనం, ఆస్తులను తెలంగాణ కల్లుగీత ఆర్థిక ఆర్థిక సహకార సంస్థకు బదిలీ చేయడం, ఇరుశాఖల మంత్రులు ఒప్పందాలపై సంతకాలు చేయడం మంచి నిర్ణయమన్నారు. 2023 నుంచి కల్లుగీత కార్మిక, ఇతర సంఘాలు చేస్తున్న ఫలితంగా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని వారు గుర్తు చేశారు. ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకోవడానికి కృషి చేసిన మంత్రి పొన్నం ప్రభాకర్, మంత్రి జూపల్లి కృష్ణారావులకు తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం జిల్లా కమిటీ తరుపున కృతజ్ఞతలు వారు తెలిపారు.

నిబంధనలు పాటించాలి

జైళ్ల శాఖ డీఐజీ శ్రీనివాస్



భువనగిరి టౌన్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : జైలు నిర్వహణలో నిబంధనలను తూ.చా. తప్పకుండా పాటించాలని జైళ్లశాఖ డీఐజీ డాక్టర్ డీ శ్రీనివాస్ ఆదేశించారు. గురువారం భువనగిరి సబ్‌జైల్‌ను ఆయన తనిఖీచేశారు. జైలులో వసతులను, భోజనం నాణ్యతను పరిశీలించారు. ఖైదీలతో మాట్లాడి జైలు నిర్వహణ తీరును అడిగి తెలుసుకున్నారు. రికార్డుల ఆధారంగా సమీక్షించారు. జైలు నిర్వహణ తీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. కాగా 25 మంది రిమాండ్ ఖైదీల సామర్థ్యం ఉన్నట్లు స్థానిక జైలు అధికారులు ఆయనకు వివరించారు. ఆయన వెంట సూపరింటెండెంట్ జే నెహ్రూ పాల్గొన్నారు.

దాడి చేసిన వ్యక్తికి ఏడాది జైలు

రూ.5వేల జరిమానా

భువనగిరి రూరల్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : భూతగాదా విషయంలో దాడి చేసిన వ్యక్తికి కోర్టు ఏడాది జైలుతో పాటు రూ.5 వేలు జరిమానా విధించింది. యాదాద్రిభువనగిరి జిల్లా భువనగిరి రూరల్ ఎస్‌హెచ్‌వో వీ సంతోష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని బొల్లేపల్లి గ్రామానికి చెందిన జిట్టా శ్రీనివాస్‌రెడ్డిపై అదే గ్రామానికి చెందిన వనం రమేష్, అతడి సోదరుడు వనం సుమన్ 2020 మే 18న భూతగాదా విషయంలో దాడి చేశారు. ఘటనపై ఫిర్యాదు మేరకు అప్పటి రూరల్ ఎస్ఐ శంకరయ్య విచారణ చేసి వనం రమేష్, సుమన్‌పై కేసు నమోదు చేసి కోర్టులో రిమాండ్ చేశారు. కేసు విచారణలో ఉండగా వనం సుమన్ అనారోగ్య సమస్యలతో 2022లో చనిపోయారు. అయితే ఈ కేసు వాదోపవాదాల అనంతరం రమేష్‌కు ఏడాది జైలు, రూ.5వేల జరిమానా విధిస్తూ భువనగిరి అసిస్టెంట్ సెషన్ కోర్టు న్యాయమూర్తి ఉషా శ్రీ గురువారం తీర్పు ఇచ్చినట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు. ఈ కేసు విచారణలో సహకరించిన భువనగిరిరూరల్ కానిస్టేబుల్ నాగరాజు, అదనపు పీపీలు సత్యనారాయణ, వరలక్ష్మిలను ఆయన అభినందించారు.

రేపటి నుంచి ఒంటిపూట బడులు

నల్లగొండ, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఈనెల 15వ తేదీ నుంచి ఒంటి పూట బడులు ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు గురువారం పాఠశాల విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేట్ యాజమాన్యాలలో ఉన్న అన్ని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు ఈనెల 15 నుంచి ఏప్రిల్ 23వ తేదీ వరకు ఉదయం 8 నుంచి మ ధ్యాహ్నం 12.30గంటల వరకు పనిచేస్తాయి. ప్రభుత్వ పాఠశాలలో పిల్లలకు 12.30గంటలకు మధ్యాహ్న భోజనం అందించిన అనంతరం వారిని ఇంటికి పంపుతారు. మూడు జిల్లాలోనూఎండల తీవ్రత అధికమవుతున్న నేపథ్యంలో ఒంటిపూట బడుల వల్ల విద్యార్థులు వేసవి తీవ్రత నుంచి గట్టెక్కనున్నారు. ఇక పదవ తరగతి పబ్లిక్ పరీక్షలకు విద్యార్థులను సమాయత్తం చేయడం కోసం యథావిధిగా ప్రత్యేక తరగతులను నిర్వహించనున్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో మొత్తం 4,381 ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు ఉండగా ఇందులో ప్రభు త్వ పాఠశాలలు 3,123, ప్రైవేట్ పాఠశాలలు 1,258 ఉన్నాయి. ఎస్ఎస్‌సీ పరీక్ష కేంద్రం ఉన్న పాఠశాలలు మధ్యాహ్నం ఒంటి గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు పనిచేసేలా ఆదేశాలు ఇచ్చారు. 2024-25 విద్యా సంవత్సరంలో చివరి రోజు ఏప్రిల్ 23 వరకు ఒంటిపూట బడులు కొనసాగనున్నాయి. ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాలను అన్ని యజమాన్యాలు అమలు చేయాలని జిల్లా విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసి ంది. ఎక్కడైనా ప్రైవేట్ పాఠశాలలు ప్రభుత్వ ఆదేశాలను ఉల్లంఘించి ఒంటిపూట బడులు నిర్వహించకపోతే జిల్లా విద్యా శాఖ అధికారులు ఆయా పాఠశాలలపై శాఖాపరమైన చర్యలు తీసుకునే అవకాశాలు ఉన్నాయి.

జాతీయ స్థాయి పోటీలకు ఎంజీయూ వేదిక కావాలి

నల్లగొండ టౌన్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడా పోటీలకు మహాత్మాగాంధీ యూనివర్సిటీ క్రీడా ప్రాంగణాలు వేదికలు కావాలని ఎంజీయూ స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ హరీష్ కుమార్ అన్నారు. ఈ మేరకు గురువారం తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ మేనేజింగ్ డైరెక్టర్ సోనా బాలాదేవిని ఎంజీయూ బృందం కలిసి నివేదించింది. మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయంలోని క్రీడా ప్రాంగణాలను రాష్ట్ర, జాతీయ స్థాయి ప్రమాణాలకు తగినట్టు అభివృద్ధి చేసిన దృష్ట్యా, మున్ముందు చలో ఇండియా అలాంటి జాతీయ స్థాయి పోటీల నిర్వహణకు అవకాశం కల్పించాలని కోరారు. ఈ సందర్భంగా వారిని ప్రత్యక్ష పరిశీలనకు ఆహ్వానించినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో సోమలింగం, శ్రీనివాసరెడ్డి, డాక్టర్ రామావత్ మురళి తదితరులు పాల్గొన్నారు.

నాయక్ — ఓ ఆల్‌రౌండర్





నేపాల్‌లో జరిగిన మ్యాచ్‌లో జట్టుతో వస్త్రంనాయక్

అంగవైకల్యం తమ ప్రతిభకు అడ్డు కాదని ఓ యువకుడు నిరూపించగా, అంగవైకల్యం స్వయం 'ఉపాధి'కి అవరోధం కాదని మరో యువకుడు అడుగు ముందుకు వేశారు. విధి రాతను ఎదిరించి ఆదర్శంగా నిలిచారు. ఆ దివ్యాంగ యువకులే నల్లగొండ జిల్లా త్రిపురారం మండలం మాటూరు గ్రామానికి చెందిన వస్త్రంనాయక్, సూర్యాపేట జిల్లా కేంద్రానికి చెందిన యాదగిరి. నిరుపేద గిరిజన కుటుంబంలో జన్మించిన వస్త్రంనాయక్ బాల్యంలోనే తల్లిని కోల్పోయాడు. ఆ తర్వాత జరిగిన ప్రమాదంలో చేతి వేళ్లనూ కోల్పోయాడు. అయినా క్రికెట్‌పై మక్కువతో మెలకువల నేర్చుకుని దివ్యాంగుల జాతీయ క్రికెట్ జట్టులో స్థానం సాధించాడు. యాదగిరిని చిన్నతనంలో రెండు కాళ్ల చచ్చుబడ్డాయి. అయినా నిరాశ చెందకుండా స్వయం ఉపాధి పొందుతూ కుటుంబాన్ని పోషించుకుంటూ శభాష్ అనిపించుకుంటున్నాడు.

(ఆంధ్రజ్యోతి-త్రిపురారం)

నల్లగొండ జిల్లా త్రిపురారం మండలం మాటూరు గ్రామానికి చెందిన ధనావత్ రాము, బుల్లి దంపతులకు ముగ్గురు సంతానం. చివరి వాడు వస్త్రంనాయక్. అతడికి మూడేళ్ల వయస్సులోనే ఉన్నపుడు తల్లి అనారోగ్యంతో మృతి చెందింది. పిల్లలను పోషించడానికి తండ్రి కూలిపనుల కోసం పలు ప్రాంతాలకు వలసవెళ్లేవాడు. వస్త్రంనాయక్ ఆరేళ్ల వయసులో తండ్రి వెంట గుంటూరు ప్రాంతానికి వెళ్లాడు. అక్కడ పనిచేసే ప్రాంతంలో పత్తి యంత్రంలో చేయి పడటంతో ఎడమ చేతి అన్ని వేళ్లనూ కోల్పోయాడు. కొద్ది రోజుల్లో కోలుకుని విద్యాభ్యాసం కొనసాగించాడు..ఒకటినుంచి ఏడో తరగతి వరకు మాటూరు, ప్రభుత్వ పాఠశాల, 8నుంచి 10వ తరగి వరకు పానగల్, ఇంటర్, డిగ్రీ నల్లగొండలో చదివాడు.

క్రికెట్‌పై మక్కువతో..

చిన్నప్పటి నుంచి వస్త్రం నాయక్ క్రికెట్‌పై మక్కువ పెంచుకున్నాడు. చెక్క బ్యాట్, రబ్బరు బంతితో సాధన ప్రారంభించాడు. మొదట్లో బ్యాట్‌ను పట్టుకోవడానికి, బౌలింగ్ వేయడానికి ఇబ్బంది పడి క్రమంగా పట్టు సాధించాడు. వస్త్రంనాయక్ ప్రతిభను గమనించిన పోలీసులు వీరబాబు, కిషన్ తమ జట్టులో చేర్చుకున్నారు. క్రికెట్‌లో రాణిస్తున్న వస్త్రంనాయక్‌కు పటాన్‌చెరువు డీఎస్పీ నూకల వేణుగోపాల్‌రెడ్డి క్రికెట్ కిట్లు అందజేయడంతో పాటు పలు విధాలుగా సహకారాలు అందించారు.

ప్రతిభతో ముందడుగు

పానగల్ పాఠశాలలో 2010లో పదో తరగతి చదువుతున్న సమయంలో హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో దివ్యాంగుల జిల్లా స్థాయి క్రికెట్ జట్టుకు వస్త్రంనాయక్ ఎంపికయ్యాడు. ఆ తర్వాత ఆంధ్రప్రదేశ్ జట్టులో స్థానం సంపాదించాడు. కర్నూలు, అనంతపూర్ జిల్లాల్లో జరిగిన మ్యాచ్‌ల్లో ఆల్‌రౌండర్‌గా రాణించాడు. 2012 నుంచి ఇప్పటి వరకు పలు రాష్ట్రాల్లో రాష్ట్ర స్థాయి మ్యాచ్‌లు ఆడాడు. 2024లో ఉత్తర్‌ప్రదేశ్‌లోని లక్నోలో జరిగిన సౌత్ జోనల్ మ్యాచ్‌లో ప్రతిభ చాటి జాతీయ జట్టుకు ఎంపికయ్యాడు. నేపాల్‌లో జరిగిన 20-20 ట్రై సీరిస్‌లో వస్త్రంనాయక్ ఆల్‌రౌండర్‌గా రాణించి 78 పరుగులు సాధించడంతో ఏడు వికెట్లు తీసి రాణించి జట్టు కప్ గెలవడంలో కీలకంగా మారాడు

స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగం ఇవ్వాలి

2010 నుంచి ఇప్పటి వరకు ప్రభుత్వం నుంచి నాకు ఎటువంటి సాయం అందలేదు. అప్పడప్పుడు కొందరు స్పాన్సర్లు ముందుకు వచ్చారు. స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగం కల్పించాలని గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మకు, పోలీస్ ఉన్నతాధికారులకు వినతిపత్రాలు కూడా అందజేశా. నా సమస్యను పరిష్కరించాలి.

-వస్త్రంనాయక్

స్వయం'ఉపాధి'తో

అంగవైకల్యాన్ని అధిగమించి ఓ యువకుడు స్వయం ఉపాధి పొందడమే కాకుండా మరో వ్యక్తికి జీవనోపాధి కల్పించి ఆదర్శంగా నిలిచాడు. సూర్యాపేట జిల్లా కేంద్రానికి చెందిన దివ్యాగుడు వీరమల్ల యాదగిరి. పుట్టుకతో రెండు కాళ్లు చచ్చుబడ్డాయి. ఆర్థిక భారంతో చదువును కొనసాగించలేకపోయాడు. కుటుంబానికి కొంతైనా అండగా ఉండటానికి ఓ పంచర్ దుకాణంలో చేరాడు. యాదగిరికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. యాదగిరి జిల్లా కేంద్రంలోని రైతుబజార్ అంబేడ్కర్ విగ్రహం సమీపంలో పంచర్(గాలి) దుకాణం ఏర్పాటు చేసుకుని రోజుకు రూ.500 నుంచి 600లు సంపాదిస్తున్నాడు. ఓ వ్యక్తికి జీవనోపాధి కల్పిస్తున్నాడు. తన కష్టాన్ని చూసి కొందరు దాతలు కుమార్తెల చదువుకు పుస్తకాలు, నగదు అందజేస్తూ సహకరిస్తున్నారని తెలిపాడు.

(ఆంధ్రజ్యోతి- సూర్యాపేట టౌన్)



పంచర్ వేస్తున్న యాదగిరి

ప్రభుత్వం సాయం అందించాలి

కాళ్లు లేనందున బలం తక్కువగా ఉంది. దీంతో పెద్ద టైర్లను పంచర్ వేయలేకపోతున్నా. ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలి. ప్రతిఒక్కరూ ధైర్యంతో బతికితే ఏదైనా సాధించవచ్చు.

- వీరమల్ల యాదగిరి, పంచర్ దుకాణ నిర్వాహకుడు

వ్యవసాయ యాంత్రీకరణకు గ్రీన్‌సిగ్నల్

5వ పేజీ తరువాయి..

పవర్ వీడర్లు, కిసాన్ డ్రోన్‌లతోపాటు ఇతర యంత్రాలను పంపిణీ చేస్తారు. 2018 నుంచి 2023 వరకు యంత్రాలు రాకపోవడంతో రైతులకు ఇబ్బందిని కలిగిన విషయాన్ని ప్రభుత్వం గుర్తించింది.

తొలివిడతలో 1,552 మందికి ప్రయోజనం

రాష్ట్ర ప్రభుత్వం తొలివిడతలో ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని 1,552 మంది రైతులకు ప్రయోజనం చేకూర్చేలా ఉత్తర్వులు జారీచేసింది. నల్లగొండ జిల్లాలో 820 మంది రైతులకు పరికరాల కోసం రూ.1,81,36,000ను కేటాయించింది. సూర్యాపేట జిల్లాలో 457 మంది రైతులకు రూ.1,06,01,000ని కేటాయించగా, యాదాద్రి భువనగిరి జిల్లాలో 275 మంది రైతులకు రూ.72.5 లక్షలను మొత్తంగా ఉమ్మడి జిల్లాకు రూ.3,59, 86, 000ను కేటాయించింది. వ్యవసాయ యాంత్రీకరణ పరికరాలకు సంబంధించి రైతులకు అవగాహన కల్పించేందుకు త్వరలో ఉమ్మడి నల్లగొండ జిల్లాస్థాయిలో అవగాహన సదస్సులతోపాటు ప్రదర్శనలు నిర్వహించే అవకాశాలున్నాయి. అయితే ఆర్థిక సంవత్సరం ముగింపునకు కొన్ని రోజులే ఉన్నందున ఈనెలలోపే అవగాహన సదస్సును నల్లగొండలో ఏర్పాటు చేసి సూర్యాపేట, యాదాద్రి భువనగిరి, నల్లగొండ జిల్లా రైతులు ఈ ప్రదర్శనలు పాల్గొనేలా అధికారులు చర్యలు తీసుకోనున్నట్లు తెలిసింది. పరికరాలు యంత్రాలు తయారు చేసే సంస్థల సహకారంతో రైతులకు అవగాహన కల్పించేందుకు ఈ ప్రదర్శనలు ఏర్పాటు చేస్తారు. ఇప్పటికే సీజన్ ముగిసేందుకు సమయం వచ్చినందున త్వరగా పరికరాలు అందజేయడం కోసం ప్రభుత్వం యోచిస్తుంది. త్వరలో జరిగే అవగాహన, ప్రదర్శనలు వ్యవసాయ అనుబంధ రంగాలను భాగస్వాములను చేయనున్నారు. గత ప్రభుత్వంలో వచ్చిన ఆరోపణలు, విమర్శలకు తావు ఇవ్వకుండా పారదర్శకంగా పథకాన్ని అమలు చేయడం కోసం సదస్సులను ఏర్పాటు చేయనున్నారు.అర్హులైన రైతులందరికీ వ్యవసాయ యాంత్రీకరణ పథకానికి సంబంధించిన పరికరాలను రాయితీపై ఇవ్వాలని నిర్ణయించారు. వ్యవసాయరంగం అభివృద్ధి చెందాలంటే కూలీలు ఉన్న ప్రస్తుత సమయంలో యాంత్రీకరణ పథకాన్ని అమలు చేయడమే మంచిదని ప్రభుత్వం భావించింది. అధికారులు ఏర్పాటు చేసే ఎగ్జిబిషన్‌లో అత్యధికంగా రైతులకు ప్రయోజనకంగా ఉండే పరికరాలను ప్రదర్శిస్తారు. ఈ ప్రదర్శన రెండు రోజులు నిర్వహించే అవకాశాలున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఈ పథకంలో కేంద్ర ప్రభుత్వ భాగస్వామ్యం కూడా ఉంది. మందుల పిచికారీకి డ్రోన్లు కూడా ఉపయోగించే విధంగా అవగాహన కల్పిస్తారు. ఆరేళ్లగా వ్యవసాయ యాంత్రీకరణ పథకం అటకెక్కిన నేపథ్యంలో రైతులకు ఈ పథకం అందుబాటులో లేకుండాపోయింది. తాజాగా ప్రస్తుత ప్రభుత్వం తీసుకొస్తున్న వ్యవసాయ యాంత్రీకరణ పథకం రైతులకు ప్రయోజనం చేకూరనుంది.

ఈ నెలాఖరులోగా పథకం అమలు చేస్తాం



ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెలాఖరులోగా వ్యవసాయ యాంత్రీకరణ పథకం కింద పరికరాలను రైతులకు అందజేస్తాం. ఇప్పటికే ప్ర భుత్వం మార్గదర్శకాలను విడుదల చేసింది. యాంత్రీకరణ పథకం నిరంతరంగా కొనసాగనుంది. ప్రతి రైతుకు ఈ పథకాన్ని వర్తింప చేయడంకోసం ప్రభుత్వం నిర్ణయం తీసుకుం ది. తొలివిడత ఈ నెలాఖరులో పూర్తి చేసి మళ్లీ ప్రభుత్వం నిధులు కేటాయించిన వెంటనే రెండో విడత పథకాన్ని అమలు చేస్తూ ముందుకు సాగడం జరుగుతుంది. ప్రతీ రైతు ఆధునిక వ్యవసాయ చేయడంకోసం ప్రభుత్వం ఈ కార్యాచరణ రూపొందించింది.

-పి.శ్రవణ్ కుమార్, జేడీఏ నల్లగొండ

దక్షిణ తెలంగాణ ప్రాజెక్టులపై బీఆర్‌ఎస్ వివక్ష

అసెంబ్లీలో ఎమ్మెల్యే వేముల వీరేశం

నార్కట్‌పల్లి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): పదేళ్ల రాష్ట్రాన్ని పరిపాలించిన బీఆర్ఎస్ దక్షిణ తెలంగాణ ప్రాంతంలోని ప్రాజెక్టులపై వివక్ష చూపిందని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం ఆరోపించారు. పదేళ్ల బీఆర్ఎస్ ప్రభుత్వం తమ బినామీలకు ప్రాజెక్టుల పేరిట టెండర్లు కట్టబెడితే...14 నెలల తమ ప్రభుత్వం, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రత్యేక చొరవతో బీ.వెల్లెంల నుంచి రైతాంగానికి నీళ్లిచ్చిందంటూ బీఆర్ఎస్‌పై సెటైర్లు విసిరారు. అసెంబ్లీ సమావేశాల సందర్భంగా గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంలో భాగంగా శాసనసభలో గురువారం వీరేశం మాట్లాడారు. బీ.వెల్లెంల ప్రాజెక్టును ప్రారంభించడంతో పాటు పరిసర గ్రామాల రైతులకు సాగునీటిని అందిస్తున్నామన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ధర్మారెడ్డిపల్లి, పిలాయిపల్లి కాల్వలను పట్టించుకోకపోతే మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి తన సొంత ఖర్చుతో కాల్వను తవ్వించిన విషయాన్ని వీరేశం గుర్తుచేశారు. పదేళ్ల అధికారంలో ఉండి ప్రాజెక్టుల కోసం నిధులు ఇవ్వని బీఆర్ఎస్ నాయకులకు 14 నెలల్లోనే ప్రజాప్రభుత్వంగా మన్ననలు పొందుతున్న సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని తమ ప్రభుత్వాన్ని విమర్శించే అర్హత లేదన్నారు.



వికసిత్ భారత్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న రిజిస్ట్రార్, అధ్యాపకులు

వికసిత్ భారత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

నల్లగొండ టౌన్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): వికసిత్ భారత్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఎంజీయూ రిజిస్ట్రార్ అల్వాల రవి, ఎన్‌జీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్. సముద్రాల ఉపేందర్, ఎస్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ మద్దిలేటి అన్నారు. వికసిత్ భారత్ పోస్టర్‌ను గురువారం వారు విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నల్లగొండ, యాదాద్రి, నాగర్ కర్నూల్ జిల్లాల పరిధిలోని యువకులు మై భారత్ పోర్టల్‌లో ఈనెల 16 వరకు రిజిస్ట్రేషన్ చేసుకొని వాట్ డస్ వికసిత్ భారత్ మీన్ టూ యూ అనే అంశంపై ఒక్క నిమి షం వీడియో తీసి పంపాలని కోరారు. నాగార్జున ప్రభుత్వ కళాశాలలో ఈ నెల19 నుంచి 20 వరకు జరిగే నోడల్ స్థాయిలో ఉత్తమ ప్రతి భతో ఎంపికైన విద్యార్థులను రాష్ట్ర స్థాయికి 10 మంది విద్యార్థులను పంపుతారని అన్నారు. కార్యక్రమంలో హరికిషన్, వీరాస్వామి , శేఖర్, స్వప్న వెంకట్‌రెడ్డి, శివరాణి, సావిత్రి, మల్లేశం, కోటయ్య, పాల్గొన్నారు.

యాదగిరీశుడికి శాస్త్రోక్తంగా నిత్య పూజలు

యాదగిరిగుట్ట, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి దివ్యక్షేత్రంలో గురువారం నిత్య కైంకర్యాలు పాంచరాత్రగమశాస్త్ర రీతిలో అత్యంత వైభవంగా నిర్వహించారు. ప్రధానాలయ నైరుతి దిశలో అష్టభుజి ప్రాకార మండపంలో ఉత్సవమూర్తులను పట్టువస్త్రాలు, ముత్యాలు, బంగారు, వజ్రవైఢూర్యాలతో దివ్యమనోహరంగా అలంకరించిన అర్చకులు గజవాహన సేవలో తీర్చిదిద్ది వేద మంత్ర పఠనాలు, మంగళవాయిద్యాల నడుమ సేవోత్సవం చేపట్టారు. ఉత్సవమూర్తులను కల్యాణ మండపంలో అధిష్ఠింపజేసి, విష్వక్సేనుడి తొలిపూజలతో కల్యాణతంతు కొనసాగింది. కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులకు స్వామివారి శేషవస్త్రాలు, ఆశీర్వచనం అందజేశారు. ముందుగా సుదర్శన శతక పఠనంతో హోమం పూజలు నిర్వహించారు. ప్రభాతవేళ గర్భాలయంలో స్వామిఅమ్మవార్లను సుప్రభాత సేవతో మేల్కొలిపి అర్చకస్వాములు నిజాభిషేకం, నిత్యార్చనలు చేపట్టారు. పాతగుట్ట ఆలయంలో నిత్య పూజలు సంప్రదాయ రీతిలో జరిగాయి. కొండపైన శివాలయంలో శ్రీపర్వతవర్ధిని రామలింగేశ్వరస్వామికి నిత్య పూజలు, యాగశాలలో నిత్య రుద్రహవనం శైవాగమ పద్ధతిలో నిర్వహించారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.30,58,258 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో ఏ.భాస్కర్‌రావు తెలిపారు

యాదగిరికొండపై కామ దహనం

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామివారి సన్నిధిలో కామ దహనం కార్యక్రమం నిర్వహించారు. స్వాగత తోరణం వద్ద ప్రత్యేక పూజల అనంతరం గురువారం పురోహితుడు నాగరాజుశర్మ దహన విశిష్టతను వివరించారు. కార్యక్రమంలో ఆలయ ఏఈవో ప్రతాప నవీన్‌కుమార్‌శర్మ, ఎస్‌పీఎఫ్ ఎస్‌ఐ అనిల్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు. కొండకింద వైకుంఠద్వారం చెంత స్థానిక భక్తులు దహన కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో స్థానికులు గౌళికర్ భానుప్రకాశ్, బాలరాజు, జగిని విజయ్ పాల్గొన్నారు. కాగా శుక్రవారం హోలీ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక సేవ చేపట్టి పూజలు నిర్వహిస్తారు. హోలీ విశిష్టతను అర్చకులు వివరిస్తారు.



కల్యాణతంతు నిర్వహిస్తున్న అర్చకులు



కొండపైన కామ దహనం చేస్తున్న ఆలయ సిబ్బంది

హ్యాంగర్ ఫ్యాబ్రిక్ బిగించే పనులు ప్రారంభం

గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది ఎండలు ఫిబ్రవరి చివరి నుంచే ముదిరాయి. దీంతో కొండపైన ఈ సమస్యలను అధిగమించేందుకు దేవస్థానం ఆధ్వర్యంలో ఏర్పాట్లకు నడుం బిగించింది. వేడిమిని తట్టుకునేందుకు తిరువీధుల్లో పూర్తిగా చలువ తెలుగు రంగు (కూల్ వైట్ పెయింట్) వేశారు. అయితే ఈ రంగుపై సూర్యకాంతి వెదజల్లి (రిఫ్లెక్షన్) భక్తుల కళ్లు మూసుకుపోతున్నాయి. ఈ నేపథ్యంలో తిరువీధుల్లో జర్మన్ టెక్నాలజీ హ్యాంగర్ ఫ్యాబ్రిక్ బిగించే పనులు గురువారం ప్రారంభించారు. స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాల ముగింపు తర్వాత తిరిగి హ్యాంగర్ ఫ్యాబ్రిక్‌ను బిగించనున్నట్లు ఇప్పటికే ఈవో భాస్కర్‌రావు తెలిపారు. అలాగే తాగునీటి సదుపాయాలు కూడా అందుబాటులో ఉంచారు.

నేత్రపర్వంగా లక్ష్మీనృసింహుని కల్యాణోత్సవం

మఠంపల్లి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : మట్టపల్లి లక్ష్మీనృసింహుని ఆలయంలో భక్తవత్సలుని కల్యాణోత్సవాన్ని గురువారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆద్యంతం హరినామ స్మరణతో జరిగిన ఈ పరిణయోత్సవ క్రతువులో తీర్థజనులు అధిక సంఖ్యలో పాల్గొని తరించారు. ప్రాతఃకాలార్చనల అనంతరం స్వయంభువునికి పంచామృతాలతో పంచసూక్త విధానంగా అభిషేకాలు చేపట్టారు. వస్త్రాలంకరణలు పూలంగి సేవలు పూర్తయ్యాక ఉదయం యాగశాలలో సుదర్శన నారసింహ హోమం జరిగింది. ఉదయం 9:30నిషాలకు చెంచులక్ష్మి, రాజ్యలక్ష్మి సమేత దివ్యమూర్తులను ప్రధాన మండపంలోకి వేంచేయించి శ్రీ స్వామికి పాద ప్రక్షాళనంగావించారు. మాంగళ్య యజ్ఞోపవీత ధారణలు, అక్షతారోహణం జరిపించి ఉత్సవ మూర్తులను ఆలయ ప్రదక్షణం చేయించారు. మధ్యాహ్నం వరకు ఆలయంలో విశేష పర్వాలు, ఆర్జిత సేవలు జరిగాయి. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు చెన్నూరి మట్టపల్లిరావు, విజయ్ కుమార్, ఈవో సిరికొండ నవీన్, పాలకవర్గ సభ్యులు, ఆలయ ఉద్యోగులు, సిబ్బంది అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



నిత్య కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

లింగ బసవేశ్వర స్వామి హుండీ రాబడి రూ.7.51లక్షలు

బీబీనగర్, మార్చి 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని పడమటి సోమారం గ్రామంలో లింగబసవేశ్వర స్వామి హుండీ రాబడిని గురువారం లెక్కించారు. ఆలయ ప్రాంగణంలో ఎండోమెంట్ ఇన్స్పెక్టర్ వెంకటలక్ష్మి, ఆలయ కమిటీ చైర్మన్ సందిగారి బస్వయ్య ఆధ్వర్యంలో హుండీని లెక్కించారు. రూ.7,51,897 ఆదాయం వచ్చినట్లు ఈవో నరేందర్ రెడ్డి తెలిపారు. ఫిబ్రవరి 22నుంచి 24వరకు 3రోజులు నిర్వహించిన బ్రహ్మోత్సవాల నుంచి ఇప్పటి వరకు భక్తులు కానుకలను లెక్కించినట్లు తెలిపారు.

నేటి నుంచి ధ్వజ స్తంభాల పునఃప్రతిష్ఠ మహోత్సవాలు

గుండాల, మార్చి 13(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో శుక్రవారం నుంచి నిర్వహించే అన్నపూర్ణ కాశీవిశ్వేశ్వర స్వామి, వేణుగోపాల స్వామి దేవాలయ, భక్తాంజనేయ స్వామి విగ్రహ, యంత్ర ప్రతిష్ఠ మహోత్సవం నిర్వహించనున్నట్లు పూజారులు రమేష్‌శర్మ, శ్రీనివాస్‌శర్మ తెలిపారు. గురువారం వేణుగోపాల స్వామి ఆలయం వద్ద వారు విలేకరులతో మాట్లాడారు. గ్రామస్థుల సహకారంతో నూతన ధ్వజ స్తంభాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

'10'విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ

వీరజాల మాలతి, ఎంఈవో, తుర్కపల్లి



పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టినట్లు ఎంఈవో వీరజాల మాలతి తెలిపారు. గురువారం 'ఆంధ్రజ్యోతి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో 'మేల్కొలుపు' లాంటి ప్రత్యేక కార్యమాల గురించి వివరించారు.

- (తుర్కపల్లి,ఆంధ్రజ్యోతి)

ఇంటర్వ్యూ Interview

ఆంధ్రజ్యోతి: 'పది' పరీక్షలకు విద్యార్థులను ఎలా ప్రిపేర్ చేశారు?

ఎంఈవో: పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి వార్షిక పరీక్షలకు సిద్ధం చేశాం. గత ఏడాది అక్టోబరులో విద్యార్థులను ఏ, బీ, సీ గ్రూప్‌లుగా విభజించి ఉదయం, సాయంత్రం స్టడీ అవర్స్ నిర్వహిచాం. సీ గ్రూప్ విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నాం.

ఆంధ్రజ్యోతి: మండలంలోని ప్రభుత్వ ప్రవేటు పాఠశాలల నుంచి పదో తరగతి పరీక్షలకు ఎంత మంది హాజరుకానున్నారు ?

ఎంఈవో: మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రవేటు విద్యార్థులను కలుపుకొని 382 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారు.

ఆంధ్రజ్యోతి: పదో తరగతి విద్యార్థులకు స్టడీ అవర్‌లో ప్రభుత్వం నుంచి వచ్చే స్నాక్స్ గ్రాంట్స్ వచ్చాయా?

ఎంఈవో: మండలంలోని అన్ని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు స్నాక్స్ గ్రాంట్స్ వచ్చాయి. ప్రతీ విద్యార్థికి రోజుకు 15రూపాయల చొప్పున ప్రభుత్వం మంజూరు చేసింది. ఆ నిధులు ఆయా పాఠశాలలు వినియోగించుకుంటున్నాయి.

ఆంధ్రజ్యోతి: ఈ విద్యా సంవత్సరం స్పోర్ట్స్ గ్రాంట్ వచ్చిందా ?

ఎంఈవో: మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు ప్రభుత్వం స్పోర్ట్స్ గ్రాంట్‌ను మంజూరు చేసింది. ఈ నిధులు ఉన్నత పాఠశాలలు, ప్రాథమికోన్నత, ప్రాథమిక పాఠశాలలకు వేరు వేరుగా నిధులు మంజూరు కాగా ఎస్ఎస్ఏ నిబంధనల క్రీడా సామగ్రిని కొనుగోలు చేసారు.

ఆంధ్రజ్యోతి: పాఠశాలలో పని చేసే స్కావెంజర్లకు వేతనాలు ఎన్ని నెలలు పెండింగ్‌లో ఉన్నాయి ?

ఎంఈవో: ప్రభుత్వం ఆదేశాల ప్రకారం స్కావెంజర్లను ఈ విద్యా సంవత్సరం ఆగస్టు నుంచి విధుల్లోకి తీసుకున్నాం. ఇప్పటి వరకు మూడు నెలల వేతనాలు ఇచ్చారు. ఇంకా నాలుగు నెలల వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయి.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి : ఎమ్మెల్సీ సత్యం

చౌటుప్పల్ టౌన్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని సీపీఐ నల్లగొండ జిల్లా కార్యదర్శి, నూతన ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అన్నారు. హైదరాబాద్ లోని మగ్దూమ్ భవన్‌లో గురువారం సీపీఐ జాతీయ సమితి సభ్యుడు పల్లా వెంకట్‌రెడ్డి, నూతన ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యంను సీపీఐ మండల కార్యదర్శి పల్లె శేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో సన్మానించారు. ప్రజా సమస్యలపై నిరంతరం ఉద్యమాలను సాగించే సత్యంకు ఎమ్మెల్సీగా అవకాశం కల్పించడంపై పార్టీ నాయకత్వానికి పల్లె శేఖర్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలకు మరిన్ని సేవలు అందించేందుకు ఈ పదవి దోహదం చేస్తుందని ఆయన అన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు బి.గాలయ్య, కె.శ్రీనివాస్, చిలువేరు అంజయ్య పాల్గొన్నారు.

గ్రామకంఠం ఆక్రమణను అడ్డుకున్న గ్రామస్థులు

మోత్కూరు, మార్చి 13: మోత్కూరు మునిసిపాలిటీ పరిధిలోని కొండగడప గ్రామంలో కొప్పుల అశోక్‌రెడ్డి గ్రామ కంఠం భూమిని ఆక్రమించడానికి ప్రయత్నిస్తుండగా గురువారం గ్రామస్థులు అడ్డుకున్నారు. గ్రామస్థుల కథనం ప్రకారం... కొండగడప గ్రామంలో బంగ్లాతోట, తట్టికోట పేరుతో సుమారు ఒక ఎకరం గ్రామ కంఠం భూమి ఉంది. సుమారు రూ.కోటి విలువ కల్గిన ఆభూమిని ఆక్రమించడానికి కొప్పుల అశోక్‌రెడ్డి గురువారం ఎక్స్‌కవేటర్‌తో అందులో పెరిగిన కంప చెట్లు తొలగించడం ప్రారంభించాడు. దాన్ని గమనించిన గ్రామస్థులు అక్కడకు వెళ్లి గ్రామ కంఠం భూమిని ఎలా ఆక్రమిస్తారని ప్రశ్నించారు. వెంటనే రెవెన్యూ, మునిసిపల్ అధికారులకు ఫిర్యాదు చేయగా ఆర్ఐ సుమన్, సర్వేయర్, మునిసిపాలిటీ నుంచి శ్రవణ్‌కుమార్ సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. గ్రామ నక్షాను పరిశీలించి, అది గ్రామ కంఠం భూమేనని, అందులో ఎలాంటి పనులు చేయవద్దని ఆదేశించి, ఎక్స్‌కవేటర్‌ను అక్కడి నుంచి పంపించేశారు. గ్రామస్తులు తహసీల్దార్, మునిసిపల్ కమిషనర్‌కు గ్రామ కంఠం భూమి ఆక్రమణకు పూనుకున్న వారిపై చర్య తీసుకోవాలని కోరుతూ వినతి పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు లెంకల వేణు, కొండా సోమల్లు, విజయకుమార్, అంబటి నర్సయ్య, కన్నెబోయిన లింగం, బీంరెడ్డి మోహన్‌రెడ్డి, దండెబోయిన శ్రీను, బొడిగె శ్రీను, అంబటి కృష్ణమూర్తి, పొన్నగాని యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

గ్రూపు-2 రాష్ట్ర స్థాయి ర్యాంకర్‌కు సన్మానం

మోత్కూరు, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): గ్రూపు-2 పరీక్షా ఫలితాల్లో రాష్ట్రస్థాయి 11వ ర్యాంకు సాధించిన మోత్కూరు పట్టణానికి చెందిన గుర్రం సాయికృష్ణారెడ్డిని, అతని తల్లిదండ్రులు మోహన్‌రెడ్డి, స్వరాజ్యంను గురువారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం తీపిరెడ్డి గోపాల్‌రెడ్డి సన్మానించారు. గ్రామీణ ప్రాంతానికి చెందిన సాయికృష్ణారెడ్డి రాష్ట్రస్థాయి ర్యాంకు సాధించడం ఈ పట్టణానికే గర్వకారణమన్నారు.

న్యాయవాది నర్సింహను కలిసిన నాయకులు

మోత్కూరు, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): ప్రణయ్ హత్య కేసును వాదించి హంతకులకు శిక్షపడేలా కృషి చేసిన న్యాయవాది దర్శనం నర్సింహను గురువారం మోత్కూరు మార్కెట్ మాజీ చైర్మన్ చిప్పలపల్లి మహేంద్రనాథ్, ఎస్సీ, ఎస్టీ అడ్వకేట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మంద నగేష్, ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ జిల్లా కమిటీ సభ్యుడు దాసరి తిరుమలేష్ నల్లగొండలోని ఆయన నివాసంలో కలిసిన అభినందించారు. శాలువతో సన్మానించారు. తగిన సాక్ష్యాధారాలతో హత్యను రుజువు చేసిన పోలీసులను, బెదిరింపులకు భయపడకుండా, ప్రలోభాలకు లొంగకుండా కేసును వాదించి న్యాయాన్ని గెలిపించిన న్యాయవాది నర్సింహను అభినందిస్తున్నామన్నారు.

రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయాలి

ఆలేరు, మార్చి 13(ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ సమావేశాల్లో ఆలేరు డివిజన్ ఏర్పాటు అంశాన్ని ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య సీఎం రేవంత్ రెడ్డిచే అధికారికంగా ప్రకటింపచేయాలని రెవెన్యూ డివిజన్ సాధన పోరాట కమిటీ కన్వీనర్ పసుపునూరి వీరేశం, కో కన్వీనర్లు చెక్క వెంకటేశ్ , ఎం.చంద్రశేఖర్ కోరారు. గురువారం ఆర్యవైశ్య భవన్‌లో జరిగిన డివిజన్ సాధన పోరాట కమిటీ సమావేశంలో వారు మాట్లాడారు. సమావేశంలో డివిజన్ సాధన పోరాట కమిటీ ప్రతినిధులు సమరసింహారెడ్డి, పద్మ సుదర్శన్, కెమిడి ఉప్పలయ్య, కుర్షిద్ పాషా, బి రవి, బేతి కృష్ణ హరి, అంజిబాబు పాల్గొన్నారు.

పాడి రైతులకు బకాయి బిల్లులు వెంటనే చెల్లించాలి


తుర్కపల్లి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలో విజయ, మదర్ డెయిరీల ద్వార రైతులకు రావాల్సిన బకాయి బిల్లులను వెంటనే చెల్లించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి జక్కా దయాకర్ డిమాండ్ చేసారు. మండల కేంద్రంలోని కమ్యూనిటీ హాల్లో గురువారం నిర్వహించిన తెలంగాణ రైతు సంఘం మండల సభలో ఆయన మాట్లాడారు. రైతులు అప్పులు చేసి పశువుల దాణా తెచ్చుకోవడంతో పాటు ఆర్థిక ఇబ్బందులతో కుటుంబ పోషణ రైతులకు భారంగా మారిందన్నారు. అనంతరం రైతు సంఘం మండల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వల్లపు భగవంత్, ప్రధాన కార్యదర్శిగా ఫకీరానాయక్ ఎన్నికయ్యారు.

స్థానికంగానే ఉపాధి శిక్షణ

(5వపేజీ తరువాయి)

తయారీ వంటి కోర్సులు ఉంటాయి. ప్రాసెస్ కార్యక్రమాల్లో ద్విచక్ర వాహనాల మరమ్మతులు, రేడియా, టీవీ మరమ్మతులు, మోటార్ రివైండింగ్, ఎలక్ట్రికల్ ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులు, ఇరిగేషన్ పంపు సెట్లు, ట్రాక్టర్, పవర్ టిల్లర్, సెల్‌ఫోన్ మరమ్మతులతో పాటు బ్యూటీషియన్ కోర్సు, ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీ, స్ర్కీన్ ప్రింటింగ్, గృహ విద్యుత్ ఉపకరణాల మరమ్మతులు, కంప్యూటర్ హార్డ్‌వేర్, డీటీపీ కోర్సుల్లో శిక్షణ పొందవచ్చు.

ఆర్ఎస్ఈటీఐ నెలకొల్పేందుకు సన్నాహాలు



కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ ద్వారా జిల్లాలోని గ్రామీణ ప్రాంత యువతకు స్వయం ఉపాధి కోర్సుల్లో శిక్షణ ఇచ్చేందుకు జిల్లాకు ఆర్ఎస్ఈటీఐ మంజూరైంది. ఈ ఆర్థిక సంవత్సరం నుంచి వివిధ కోర్సుల్లో యువతకు శిక్షణ ఇవ్వనున్నాం. ఇందుకోసం భవనంతోపాటు సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. జిల్లాకేంద్రానికి సమీపంలో ఆర్ఎస్ఈటీఐని నిర్మించేందుకు ఎకరం స్థలం కావాలని కలెక్టర్‌కు విన్నవించాం. కేంద్రం భవన నిర్మాణాలకు రూ.2కోట్లు మంజూరుచేసింది. స్థలం కేటాయించగానే భవనం నిర్మాణ పనులు ప్రారంభిస్తాం. ఆర్ఎస్ఈటీఐ ఏర్పాటుతో జిల్లాయువతకు ఎంతో ప్రయోజనం చేకూరనుంది.

-నాగిరెడ్డి, డీఆర్డీవో

గ్రంథాలయానికి సొంత భవనమేదీ?



గ్రంథాలయం కొనసాగుతున్నది ఇందులోనే.., ప్రారంభించి వదిలేసిన కట్టడం



● కమ్యూనిటీ హాల్‌లో అరకొర వసతుల మధ్య గ్రంథాలయం

తుర్కపల్లి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): తుర్కపల్లి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన గ్రంథాలయంలో కనీస మౌలిక వసతులు లేక పోవడంతో పాఠకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వాలు మారినా ఇక్కడి గ్రంథాలయ పరిస్థితులు మాత్రం మారడం లేదు. గత 40ఏళ్లుగా గ్రంథాలయాన్ని కొన్ని రోజులు గ్రామంలోని పలు అద్దె ఇళ్లలో ఇరుకైన గదుల్లో నిర్వహించి, ప్రస్తుతం బీసీ కాలనీలోని కమ్యూనిటీ హాల్‌లో నిర్వహిస్తున్నారు. కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించడం వల్ల గణేష్, దుర్గామాత నవరాత్రుల్లో భాగంగా ఈ కమ్యూనిటీ హాల్‌లోనే విగ్రహాలు ప్రతిష్ఠించి పూజలు నిర్వహించినప్పుడు, వివిధ పార్టీల నాయకులు సభలు, సమావేశాలు నిర్వహించినప్పుడు గ్రంథాలయం నిర్వాహన ఇబ్బందిగా మారుతుంది. దీంతో గ్రంథాలయానికి వచ్చే పాఠకులు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. అంతేకాకుండా ఈ కమ్యూనిటీ హాల్‌లో విద్యుత్ సదుపాయం, పాఠకులు కూర్చోవడానికి కుర్చీలు లేవని పలువురు పేర్కొంటున్నారు. మండల కేంద్రానికి చెందిన ప్రజలే కాకుండా మండలంలోని అన్ని గ్రామాల నుంచి యువకులు, విద్యార్థులు వివిధ రకాల పుస్తకాలు, వారా పత్రికలు చదివేందుకు వస్తారు. గ్రంథాలయంలో మూత్రశాలు, మరుగుదొడ్లు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. మండల కేంద్రంలో నూతన భవనం నిర్మించి అన్ని మౌలిక వసతులు కల్పించాలని మండల ప్రజలు ప్రజాప్రతినిధులు, అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు.

నిలిచిన భవన నిర్మాణ పనులు

10సంవత్సరాల క్రితం మండల కేంద్రంలోని తుర్కపల్లి-యాదగిరిగుట్ట ఆర్అండ్‌బీ రోడ్డు ప్రక్కన ఉన్నత పాఠశాల సమీపంలో గ్రంథాలయం భవన నిర్మానం పనులను రూ.1.50వేల రూపాయలతో ప్రారంభించి, బేస్మెంట్ పనులు పూర్తి చేసి, పిల్లర్స్ నిర్మాణం కోసం ఇనుప సీకులు నిలబెట్టారు. ఈ పనులు అర్థాంతరంగా నిలిచి పోవడంతోప్రస్తుతం ఆ సీకులు తుప్పు పట్టి పోయాయి. యాదగిరిగుట్ట వరకు చేపడుతున్న రోడ్డు విస్తరణ పనుల్లో ఈ భవనం పోతుందనే ఉద్దేశంతో ఈ భవన నిర్మాణ పనులను సంబంధింత అధికారులు నిలిపి వేశారు.

నిధుల మంజూరుకు తీర్మానం



తుర్కపల్లి మండలం కేంద్రంలో యాదగిరిగుట్ట రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా గతంలో ప్రాంభించిన భవనం పోతోంది కాబట్టి ఆ భవన నిర్మాణ పనులను నిలిపి వేశాం. మరో దగ్గర గ్రంథాలయం నూతన భవన నిర్మాణానికి స్థలం కేటాయించారు. తుర్కపల్లిలో నూతన భవన నిర్మాణం చేపట్టేందుకు ప్రభుత్వం నుంచి నిధుల మంజూరుకు జిల్లా సర్వసభ్య సమావేశంలో తీర్మానం చేశాం. 2026-27 సంవత్సరంలో భవన నిర్మాణానికి నిధులు మంజూరవుతాయి. నిధులు మంజూరు కాగానే అన్ని హంగులతో నూతన భవనాన్ని నిర్మిస్తాం.

-ఎండీ.అవేస్‌చిస్తీ, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్

ప్రశ్నిస్తే సస్పెండ్ చేయడం సమంజసం కాదు



మోత్కూరు: దిష్టిబొమ్మను దహనం బీఆర్ఎస్ చేస్తున్న నాయకులు

మోత్కూరు, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ వైఫల్యాలపై ప్రశ్నిస్తే అసెంబ్లీ సెషన్‌నుంచి సస్పెండ్ చేయడం సమంజసం కాదని బీఆర్ఎస్ నాయకులు అన్నారు. మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డిని గురువారం అసెంబ్లీ నుంచి సస్పెండ్ చేసినందుకు నిరసనగా మోత్కూరు అంబేడ్కర్ చౌరస్తాలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా ప్రజలకు ఇచ్చిన హామీలు ఎందుకు అమలు చేయడం లేదని అసెంబ్లీలో నిలదీసినందుకు ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డిని సభ నుంచి సస్పెండ్ చేశారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ నియంతృత్వ పాలన సాగిస్తున్నదన్నారు. ప్రతిపక్ష నేతలు అసెంబ్లీలో ఉంటే వారు అడిగే ప్రశ్నలకు సమాధానం చెప్పలేమని సభ నుంచి సస్పెండ్ చేస్తున్నారని విమర్శించారు. ప్రజా ప్రభుత్వమంటే ఇదేనా అని ప్రశ్నించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మోత్కూరు, అడ్డగూడూరు మండలాల అధ్యక్షులు పొన్నెబోయిన రమేష్, కొమ్మిడి ప్రభాకర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు జంగ శ్రీనివాస్, మార్కెట్ మాజీ చైర్మన్లు తీపిరెడ్డి మేఘారెడ్డి, కొణతం యాకూబ్‌రెడ్డి, చిప్పలపల్లి మహేంద్రనాథ్, మాజీ సర్పంచులు బయ్యని పిచ్చయ్య, రాంపాక నాగయ్య, సింగిల్ విండో డైరెక్టర్ పురుగుల మల్లయ్య, నాయకులు కొండ సోమల్లు, గజ్జి మల్లేష్, సిహెచ్.సత్యంగౌడ్, బందెల శ్రీను, పి.విష్ణుమూర్తి, దాసరి తిరుమలేష్, కూరెల్ల పరమేష్, మొరిగాల శ్రీను, కళ్యాణ్ పాల్గొన్నారు.

అడ్డగూడూరు: మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై సీఎం రేవంత్‌రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలను వెంటనే విరమించుకుని బహిరంగ క్షమాపణ చెప్పాలని బీఆర్ఎస్ పట్టణశాఖ అధ్యక్షుడు నాగులపల్లి దేవగిరి, మాజీ ఎంపీటీసీ పూలపెల్లి జనార్ధన్‌రెడ్డి అన్నారు. గురువారం రాత్రి మండల కేంద్రంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిష్టి బొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, మాజీ సీఎం కేసీఆర్‌పై అనుచిత వాఖ్యలను చేసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తన వ్యాఖ్యలను విరమించుకుని బహిరంగ క్షమాపణ చేప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు గజ్జెల్లి రవి, సోమిరెడ్డి పురుషోత్తం రెడ్డి, గూడేపు పరమేష్, బాలెంల అ యోధ్య, బాలెంల రాజు, బండి యాదగిరి, ఎలిజాల దయాకర్, బాలెంల మల్లయ్య పాల్గొన్నారు.

లోవోల్టేజీ సమస్యకు పరిష్కారం

చౌటుప్పల్ టౌన్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): అదనపు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ల ఏర్పాటుతో లో- ఓల్టేజీ సమస్యకు పరిష్కారం లభిస్తుందని ట్రాన్స్‌కో డీఈ మల్లికార్జున్ అన్నారు. చౌటుప్పల్ పట్టణంలోని మణికంఠ కాలనీ, కంఠమహేశ్వర కాలనీ, లింగోజీగూడెంలలో 100కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లను గురువారం డీఈ మల్లికార్జున్ ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఈ మాట్లాడుతూ, విద్యుత్ సరఫరా ను మెరుగు పరిచేందుకు గాను మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమాల్లో మునిసిపల్ మాజీ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు, మాజీ జడ్పీటీసీ చిలుకూరి ప్రభాకర్ రెడ్డి, మాజీ సర్పంచ్ పబ్బు రాజు, ట్రాన్స్ కో ఏడీఈ పద్మ, ఏఇ సతీష్ , సీతారామచంద్ర స్వామి దేవస్థానం చైర్మన్ బి.మురళి, కాంగ్రెస్ బ్లాక్, పట్టణ అధ్యక్షుడు ఆకుల ఇంద్రసేనారెడ్డి, సుర్వి నర్సింహ పాల్గొన్నారు.

మొల్లమాంబ జీవితం స్ఫూర్తిదాయకం



తుర్కపల్లి: మొల్లమాంబ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

భువనగిరి గంజ్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): రామాయణాన్ని సంస్కృతంలో నుంచి తెలుగులోకి అనువదించిన తొలి తెలుగు కవయిత్రి మొల్లమాంబ జీవితం నేటి తరానికి స్ఫూర్తిదాయకం అని వక్తలు అన్నారు. గురువారం భువనగిరి జిల్లా కేంద్రంలోని కుమ్మరివాడ చౌరస్తాలో కవయిత్రి మొల్లమాంబ 584వ జయంతి సందర్భంగా ఆమె విగ్రహానికి పలువురు నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆమె ప్రధానంగా సరళమైన తెలుగును ఉపయోగించి రామాయణాన్ని అనువదించి ఆదర్శంగా నిలిచారన్నారు. కుమ్మరి కులస్థులకు ప్రభుత్వం సబ్సిడీపై రుణాలతో పాటు కుండల తయారీకి ఆధునిక పరికరాలను అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. కుమ్మరి సంఘం అధ్యక్షుడు తాడురు అంజయ్య, బాల్ శంకర్, రాజు కుమార్, కాంగ్రెస్ నాయకులు పోత్నాక్ ప్రమోద్‌కుమార్, బర్రె జహంగీర్, బీజేపీ నాయకులు రత్నపురం బలరాం, కోళ్ల బిక్షపతి, పట్నం శ్రీను, సుర్వి శ్రీనివాస్, పాదరాజు, లక్ష్మీనారాయణ, బీఆర్ఎస్ నాయకులు ఏవీ.కిరణకుమార్, పాండు, రచ్చ శ్రీనివాస్, ఎనబోయిన అంజనేయులు, ప్రసన్న పాల్గొన్నారు.

తుర్కపల్లి: మండల కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో కుమ్మరి సంఘం అధ్యక్షుడు దేవరుప్పల అయిలయ్య, నియోజక వర్గం కన్వీనర్ జివిలీకపల్లి ఆంజనేయులు, కో కన్వీనర్ దేవరుప్పల మల్లేష్, మండల ప్రధాన కార్యదర్శి నాగాయపల్లి శివరాములు, మండల ఉపాధ్యాక్షులు రేణికుంట భాస్కర్, బేతాళ బిక్షపతి, సీపీఐ మండల కార్యదర్శి సిలివేరు దుర్గయ్య. కొలనుపాక కొండల్ పాల్గొన్నారు.

చౌటుప్పల్ టౌన్ : పట్టణ పరిధిలోని తంగడపల్లిలో నిర్వహించిన కార్యక్రమంలో కుమ్మరి సంఘం అధ్యక్షుడు చిలువేరు కృష్ణ, కుమ్మరి సంఘం నాయకులు చిలువేరు నర్సింహ, ఊషయ్య, వెంకటేశం, గాలయ్య, విజయ్ కుమార్, ముత్యాలు, సత్తయ్య, లింగస్వామి, నరేష్ పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

చౌటుప్పల్ టౌన్ : పట్టణంలోని 17, 18 వ వార్డుల్లో మంచినీటి సమస్య ను పరిష్కరించాలని ఆయా కాలనీల వాసులు కోరారు. ఈ మేరకు గురువారం మునిసిపల్ కమీషనర్ కె. నర్సింహారెడ్డికి వినతి పత్రం అందజేశారు. వారం రోజులకు ఒక సారి ట్యాంకర్ ద్వారా చేస్తున్న నీటి సరఫరాతో సమస్య తీరడం లేదని, ట్యాంకర్ల సంఖ్య ను పెంచాలని కమీషనర్ ను వారు కోరారు. వినతి పత్రం అందజేసిన వారిలో కంచర్ల గోవర్ధన్ రెడ్డి, కాసోజు యాదయ్య, పబ్బు రవీందర్, మెట్టు రామచంద్రారెడ్డి, సామ జైపాల్ రెడ్డి, చీరిక దామోదర్ రెడ్డి, సప్పిడి హరీష్‌రెడ్డి ఉన్నారు.

భువనగిరి (కలెక్టరేట్) : రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి 15 శాతం నిధులను కేటాయించాలని కలెక్టరేట్ ఏవో జగన్మోహన్ ప్రసాద్‌కు ఏబీవీపీ ఉమ్మడి నల్గొండ జిల్లా కన్వీనర్ మణికంఠ వినతిపత్రం అందజేశారు. విద్యార్థులకు స్కాలర్‌షిప్స్, ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉద్యోగావకాశాలు కల్పిస్తామని ఇచ్చిన హామీ నిలుపుకోవాలని వెంటనే బడ్జెట్ సమావేశాల్లో 15 శాతం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో దీపిక, నితిన్ తదితరులున్నారు.

గుండాల: మండలంలోని గంగాపురం గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన అల్వాల మల్లయ్య కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్య గౌడ్ సహకారంతో బీఆర్ఎస్ నాయకులు రూ. 5వేలు ఆర్థిక సాయం అందచేశారు. కార్యక్రమంలో నాయకులు సోమిరెడ్డి, అలీమ్, అరవింద్, యాకుబ్, నర్సయ్య, మనోజ్, అంజయ్య పాల్గొన్నారు.

యాదగిరిగుట్ట రూరల్: ప్రభుత్వం వృద్ధుల కోసం అనేక చట్టాలు చేసినా వాటిపై అవగహన లేకపోవడంతో వయోవృద్ధులు అన్యాయానికి గురవుతున్నారని టాస్కా మండల అధ్యక్షుడు ముడుంబై జయమోహనాచార్యులు అన్నారు. గురువారం పట్టణంలో ఆ సంఘం ముఖ్యుల సమావేశం జరిగింది. సమావేశంలో సంఘం మండల ప్రదాన కార్యదర్శి పుల్లం చక్రపాణి, ఉపాధ్యక్షుడు కలకుంట్ల బాలనర్సయ్య గౌడ్, కోశాధికారి గంగసాని రామారావు, కార్యదర్శి కోల అంజనేయులుగౌడ్, జిల్లా కోఆర్డినేటర్ సహదేవ్ పాల్గొన్నారు.

చౌటుప్పల్ రూరల్: గ్రామాల భివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ నాయకుడు పబ్బు రాజు గౌడ్ అన్నారు. మండల పరిధిలోని పంతంగిలో మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి నిధులతో మంజూరైన ట్రాన్స్‌ఫార్మర్లను రాజు గౌడ్ ప్రారంభించారు. మాజీ జడ్పీటీసీ చిల్కూరి ప్రభాకర్ రెడ్డి, నాయకులు ఆకుల ఇంద్రసేనారెడ్డి, వెంకటయ్య, భద్రయ్య, కడగంచి జనార్ధన్, చీర్క అంజిరెడ్డి, వెంకట్ పాల్గొన్నారు.

● చౌటుప్పల్ మండలంలోని కొయ్యలగూడెంలో ఎస్సీ ల్యాబ్, గ్రామ పంచాయతీ నిధులతో ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్‌ను గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు పబ్బు రాజు గౌడ్, మునిసిపల్ మాజీ చైర్మన్ రాజు, ఎస్సీ ల్యాబ్ ఎస్ఆర్ అచ్యుత్, శివరామకృష్ణ, మాజీ ఎంపీటీసీ ఈశ్వరమ్మ, సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.

చౌటుప్పల్ రూరల్: సాయి యాదాద్రి సేవా ఆశ్రమంలో రెడ్డి క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. రెడ్ క్రాస్ జిల్లా చైర్మన్ డాక్టర్ లక్ష్మీ నర్సింహారెడ్డి వైద్య శిబిరం ప్రారంభించారు. వృద్ధులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందచేశారు. కార్యక్రమంలో డాక్టర్లు జయ శ్రీ, వై అనిల్ రెడ్డి, సురేష్‌కుమార్, లత విజయ్‌కుమార్, బాలాజి, ప్రభాకర్‌రెడ్డి, అంజయ్య పాల్గొన్నారు.

భువనగిరి రూరల్: 25శాతం రాయితీపై తమ ప్లాట్లను క్రమబద్ధీకరించుకోవాలని ఎంపీడీవో సీహెచ్.శ్రీనివాస్, మండల పంచాయతీ అధికారి మొరిగాడి దినకర్ గౌడ్ అన్నారు. ఎల్ఆర్ఎస్ మేళాలో భాగంగా భువనగిరి ఎంపీడీవో కార్యాలయంలో 25శాతం రాయితీపై ఎల్ఆర్ఎస్ ప్లాట్ల క్రమబద్ధీకరణ దరఖాస్తుదారులతో ఆయన సమావేశం నిర్వహించి అవగాహన కల్పించారు.

అడ్డగూడూరు: తుంగతుర్తి మండల కేంద్రంలో ఈ నెల 16తేదీన ఎమ్మెల్యే మందుల సామేలు ఆధ్వర్యంలో జరిగే ఎస్సీ వర్గీకరణ, బీసీ కులగణనపై నిర్వహిస్తున్న సభను విజయవంతం చేయాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నిమ్మనగోటి జోజి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మండల ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు.

ఆలేరు రూరల్: ఉపాధి కార్మికులకు అన్ని రకాల వసతులు కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు జూకంటి పౌల్ అన్నారు. మండలంలోని శ్రీనివాసపురంలో ఆయన ఉపాధి హామీ కార్మికులతో కలుసుకొని మాట్లాడారు. నాయకులు బొమ్మకంటి లక్ష్మీనారాయణ, ముకుంద, అంజనేయులు, కనకయ్య ఉన్నారు.

వలిగొండ: మండలంలోని సంగెం గ్రామం నుండి గోకారం, రామసముద్రం కాల్వ వరకు దీవీస్ లేబొరేటరీస్ లిమిటెడ్ సౌజన్యంతో రూ.5లక్షల వ్యయంతో కాల్వ పూడిక తీత పనులు, గుర్రపుడెక్క ఆకు తొలగింపును చేపట్టారు. దివీస్ లెబొరేటరీస్ లిమిటెడ్ చేస్తున్న సహకారంతో రైతులకు మేలు జరుగుతుందని అన్నారు.

ప్రజాసమస్యల పరిష్కారానికి సీపీఎం పోరుబాట



ఆలేరు: శర్బణాపురంలో ఎండిన పంటను పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

వలిగొండ, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యల పరిష్కారానికై మార్చ 14 నుండి 28 తేదీ వరకు జరిగే పోరుబాటను జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు మాటూరి బాలరాజు పిలుపునిచ్చారు. గురువారం మండల కేంద్రంలో సీపీఎం పార్టీ కార్యాయంలో మండల కమిటీ సమావేశం జరిగింది. సమావేశంలో నాయకులు కందాడి సత్తిరెడ్డి అధ్యక్షత వహించగా, సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు మద్దెల రాజయ్య మండల కార్యదర్శి సిర్పంగి స్వామి పాల్గొన్నారు.

మోత్కూరు : బునాదిగానికాల్వ పనులు పూర్తిచేయాలని సీపీఎం మండల కార్యదర్శి గుండు వెంకటనర్సు డిమాండ్ చేశారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. నాయకులు దడిపల్లి ప్రభాకర్, కుర్మేటి యాదయ్య, పసునూరి చంద్రారెడ్డి, పానుగుల రమేష్ ఆయన వెంట ఉన్నారు.

ఆలేరు రూరల్: ఆలేరు మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కల్లూరి మల్లేశం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం ఆయన ఆలేరు మండలంలోని శర్బణాపురం గ్రామంలో భూగర్భ జలాలు అడుగంటిపోయి ఎండిపోతున్న వరి పంటలను పరిశీలించి మాట్లాడారు. నాయకులు దూపటి వెంకటేష్, కారె రాజు, సత్యరాజయ్య, మల్లేష్ ఉన్నారు.


భువనగిరి రూరల్: రైతుల పొలాలకు వెళ్లేందుకు బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు దయ్యాల నర్సింహ, మండల కార్యదర్శి పల్లెర్ల అంజయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని ముత్తిరెడ్డిగూడెం వద్ద సీపీఎం నేతలు, నాయకులు నిరసన తెలిపారు.

భూదాన్‌పోచంపల్లి : పోచంపల్లి మున్సిపల్ కేంద్రంలోని పలు వార్డుల్లోని సమస్యలను పరిష్కరించాలని సీపీఎం మండల కార్యదర్శి కోట రామచంద్రారెడ్డి, పట్టణ కార్యదర్శి దుబ్బాక జగన్ డిమాండ్‌చేశారు. గురువారం సీపీఎం పోరుబాటలో భాగంగా పట్టణంలోని 5,6 వార్డుల్లో సమస్యలపై సర్వే నిర్వహించారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి: ఎస్ఎఫ్ఐ

భువనగిరి గంజ్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : విద్యారంగానికి పెండింగ్‌లో ఉన్న స్కాలర్షిప్ ఫీజు రియింబర్స్‌మెంట్ తక్షణమే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ ఉమ్మడి రాష్ట్ర పూర్వ అధ్యక్షుడు కల్లూరి మల్లేషం అన్నారు. భువనగిరి జిల్లా కేంద్రంలోని గురువారం స్థానిక సుందరయ్య భవనంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సమావేశం జిల్లా ఉపాధ్యాక్షుడు ఈర్ల రాహుల్ అధ్యక్షతన జరిగింది. సమావేశంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి లావుడియా రాజు, జిల్లా కార్యదర్శి తీగుళ్ల శ్రీనివాస్, జిల్లా కమిటీ సభ్యులు ఈర్ల కార్తీక్, బవాని శంకర్, పూజిత, హిందు, నేహల్, శ్రావణ్ పాల్గొన్నారు.

వైభవంగా లక్ష్మీనారాయణస్వామి బ్రహ్మోత్సవాలు



గరుఢ ధ్వజం ఎగురవేస్తున్న అర్చకులు

భూదాన్‌పోచంపల్లి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రసిద్ధ లక్ష్మీనారాయణస్వామి దేవాలయం బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం ప్రాబోధకి అగ్నిప్రతిష్ఠ హోమం, ధ్వజారోహణం, బలిహరణం, గరుడముద్ద కార్యక్రమాలను పద్మశాలి మహాజన సంఘం అధ్యక్షుడు సీత సత్యనారాయణ శ్రేష్ఠి నిర్వహించారు. నివేదన హారతి తీర్థ ప్రసాదగోష్ఠి ఎకెఎల్‌బీ హ్యాండ్లూమ్ మార్కెట్ అధ్యక్షుడు కస్తూరి సుదర్శన్, పోచంపల్లి అర్బన్ బ్యాంకు డైరెక్టర్ రాపోలు వేణు నిర్వహించారు. సాయంత్రం దేవతామ్వానం, భేరిపూజ, హోమం, బలిహరణం, నివేదన హారతి, తీర్థ ప్రసాద వినియోగం పద్మానగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు గంజి గణేష్, చేనేత నాయకులు కుడికాల బాలనర్సింహ, కుడికాల రామనర్సింహ నిర్వహించారు. ఆలయం కమిటీ అధ్యక్షుడు అంకం వినోద్‌కుమార్ పాల్గొన్నారు.